



ఆరణి నామినేషన్ సందర్భంగా తిరుపతి వీధుల్లో నిర్వహించిన ప్రదర్శన

అట్టహాసంగా ఆరణి నామినేషన్

● ఐదవ రోజు 31మంది నామినేషన్లు ● పార్లమెంటుకు 5... అసెంబ్లీ స్థానాలకు 26

తిరుపతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఐదవ రోజైన మంగళవారం మొత్తం 31 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తిరుపతి పార్లమెంటు స్థానానికి ఐదుగురు, గూడూరు అసెంబ్లీకి ఐదుగురు, సూళ్ళూరుపేటకు ఇద్దరు, సత్యవేడుకు ఇద్దరు, శ్రీకాళహస్తికి ముగ్గురు, తిరుపతికి ఎనిమిదిమంది, చంద్రగిరికి ఆరుగురు చొప్పున ఆరు అసెంబ్లీ స్థానాలకు గానూ 26 మంది చొప్పున వున్నారు. వెంకటగిరి స్థానానికి మంగళవారం నామినేషన్లు ఏమీ దాఖలు కాలేదు.తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు వేలాదిమంది కార్యకర్తలతో ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతల అరాచకాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. కాబట్టే నామినేషన్ కార్యక్రమానికి వేలాదిమంది తరలివచ్చారన్నారు. చంద్రగిరి నుంచీ టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ నామినేషన్ పత్రాలు సమర్పించారు. గూడూరు నుంచీ వైసీపీ తరపున మేరిగ మురళీధర్ రెండు సెట్లు నామినేషన్లు వేశారు. సూళ్ళూరుపేట నుంచీ కాంగ్రెస్ తరపున కన్నంబాకం హరికృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. సత్యవేడు నుంచీ వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేశ్, శ్రీకాళహస్తి నుంచీ కాంగ్రెస్ తరపున పోతుగుంట రాజేష్ నాయుడులు నామినేషన్లు వేశారు.తిరుపతి పార్లమెంటుకు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున రిటైర్డు ఐఏఎస్ అధికారి జి.విజయ్‌కుమార్, అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ తరపున బి.భరణి, ఇండియన్ బిలీవర్స్ పార్టీ నుంచీ సి.డేవిడ్, జై హిందూస్థాన్ పార్టీ తరపున అక్కిలిగుంట మధు, ఇండిపెండెంట్‌గా కట్టమంచి ప్రభాకర్ నామినేషన్లు వేశారు. గూడూరు అసెంబ్లీకి ఇండియన్ బిలీవర్స్ పార్టీ నుంచీ కర్ల రమేష్ బాబు, బీఎస్పీ అభ్యర్థి అన్నెం మల్లికార్జున, జై భారత్ నేషనల్ పార్టీ తరపున గొర్రిపాటి వెంకటేశ్వర్లు, ఇండిపెండెంట్‌గా తాటిపర్తి బాబు నామినేషన్లు దాఖలు చేశారు. సూళ్ళూరుపేట అసెంబ్లీకి ఇండిపెండెంట్‌గా నెలవల జగదీష్, సత్యవేడు అసెంబ్లీకి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచీ జి.విజయ్‌కుమార్ నామినేషన్లు వేశారు.శ్రీకాళహస్తి అసెంబ్లీకి ఇండిపెండెంట్‌గా మన్నసముద్రం నాగరాజు, వైసీపీ డమ్మీ అభ్యర్థిగా బి.శ్రీ పవిత్ర నామినేషన్లు దాఖలు చేశారు. చంద్రగిరి అసెంబ్లీ స్థానానికి నవ భారత నిర్మాణ సేవా పార్టీ తరపున పత్తిపుత్తూరు విశ్వనాథ రెడ్డి, జై హిందూస్థాన్ పార్టీ తరపున ఎం.నీలకంఠ, జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ తరపున ఎల్.ప్రసాద్, భారత చైతన్య యువజన పార్టీ తరపున అక్కిపల్లి కృష్ణవేణి యాదవ్, ఇండిపెండెంట్లుగా శ్రీచరణ్, మాదాసి ప్రభాకర్, సంజయ్ కుమార్ నామినేషన్లు వేశారు. తిరుపతి అసెంబ్లీకి జనసేన డమ్మీ అభ్యర్థిగా ఎ.సత్యవతి, ఇండిపెండెంట్లుగా షేక్ మహ్మద్ గౌస్, ఆర్.జ్యోతి, బుడ్డోళ్ళ విశ్వనాథ్, రంగూన్ శంకర్, ఊటుకూరు సుబ్రమణ్యం నామినేషన్లు దాఖలు చేశారు.



నామినేషన్ వేసేందుకు వెళుతున్న ఆరణి శ్రీనివాసులుతో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

వడదెబ్బతో మహిళ మృతి



కృష్ణమ్మ (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 23: వడదెబ్బకు గురై పుత్తూరు మండలంలో ఓ మహిళ మృతి చెందింది. పరమేశ్వరమంగళం దళితవాడకు చెందిన ఎం.కృష్ణమ్మకు వడదెబ్బ తగలడంతో మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబసభ్యులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడే ఆమె మృతి చెందింది.

రూ. 9.64 కోట్ల బంగారం,వెండి సీజ్



వాహనంలో ఆభరణాల పెట్టెలను తనిఖీ చేస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

చిల్లకూరు, ఏప్రిల్ 23 : సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా మంగళవారం పెద్దఎత్తున తరలిస్తున్న బంగారం, వెండి ఆభరణాలను ఆదాయపన్నుశాఖకు అప్పగించినట్లు సీఐ వేణుగోపాల రెడ్డి చెప్పారు. చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద వున్న చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా జీఆర్‌టీ, జోయ లూకాస్, రాధాకృష్ణా, సదం జ్యూవెలరీ దుకాణాలకు చెందిన బంగారం, వెండి ఆభరణాలను నెల్లూరు నుంచి మదనపల్లె, తిరుపతి, చిత్తూరు ప్రాంతాలకు సరైన ధృవీకరణపత్రాలు లేకుండా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ వాహనంలో రూ. 9,41,76,050 విలువచేసే 13 కేజీల బంగారం, రూ. 22,28,304 విలువ చేసే 21 కేజీల వెండి అభరణాలు లభించాయన్నారు. సీజ్ చేసి ఆదాయపన్నుశాఖకు అప్పగించడం జరిగిందన్నారు.

రైల్వేస్టేషన్లలో ఎకానమీ మీల్స్

తిరుపతి (సెంట్రల్), ఏప్రిల్ 23: వేసవి కాలంలో రైళ్లలో సాధారణ కోచ్‌లో ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం ఎకానమీ మీల్స్ అందిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. 12 రైల్వేస్టేషన్లలో 18 కౌంటర్ల ద్వారా ఈ భోజనాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా హైదరాబాదు, విజయవాడ, రేణిగుంట, తిరుపతి, పాకాల, గుంతకల్, వికారాబాదు, రాజమండ్రి, డోన్, నంద్యాల, పూర్ణ, ఔరంగాబాదు స్టేషన్లలో ఈ ఆహారాన్ని ప్రయాణికులకు అందిస్తున్నామని అధికారులు వివరించారు. వీటిల్లో రెండు రకాల మీల్స్ ఉన్నాయి. మొదటి రకం రూ.20, రెండో రకం స్నాక్స్‌తోపాటు భోజనం రూ.50 చొప్పున ధరలు నిర్ణయించారు. ఇప్పటికే భారత రైల్వేలో 100 స్టేషన్లలో 150 కేంద్రాల్లో ఎకానమీ మీల్స్ విక్రయిస్తున్నామన్నారు. గత ఏడాది 51 స్టేషన్లలో ప్రయోగాత్మకంగా అమలు చేశామని తెలియజేశారు. భారత రైల్వే ఐఆర్‌సీటీసీ సంయుక్తంగా వీటిని నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు.

పక్కదారి పట్టిన రూ.20 కోట్లు?



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిట్ అధికారులు



ఆడిట్ జరుగుతున్న గది

● రుయా ఆడిట్‌లో వెలుగుచూస్తున్న అక్రమాలు
● కోట్లాది రూపాయల మాయం వెనుక వైసీపీ నేతల హస్తం
● కీలకమైన రికార్డులూ మాయం?

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 23 : తిరుపతి రుయాస్పత్రిలో జరుగుతున్న ఆడిట్ తనిఖీల్లో పెద్దఎత్తున అక్రమాలు వెలుగు చూస్తున్నట్లు సమాచారం.గత ఐదేళ్లలో కోట్లాది రూపాయల మాయం వెనుక వైసీపీ నేతల ప్రమేయముందన్న ప్రచారం జరుగుతోంది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో రాజకీయ ప్రమేయంతో నామినేట్ అయిన ఓ వ్యక్తి ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఐదేళ్లుగా రుయాస్పత్రిలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, కొనుగోళ్లు, బిల్లుల మంజూరు, ఇతర నిధులు కేటాయింపు, వాటి ఖర్చులకు సంబంధించి ఇరవై రోజులుగా ఆడిట్ అధికారులు విచారణ చేస్తున్నారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఆడిట్ కావడంతో 2018-19 సంవత్సరం నుంచి 2023-24 సంవత్సరం వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలను ఆడిట్ అధికారులు పరిశీలిస్తున్నారు. సంబంధిత సిబ్బందిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం.ఈ ఆడిట్‌లో ఎన్నో అక్రమాలతో పాటు దాదాపు రూ. 20 కోట్లకు పైగా నిధులు పక్కదోవ పట్టినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. మరో రెండు రోజుల్లో ఆడిట్ పూర్తికావస్తుండడంతో ఆడిట్ అధికారులు ప్రభుత్వానికి ఏ విధమైన నివేదికలు అందించనున్నారో అని అక్రమాలకు పాల్పడిన వారు ఆందోళన చెందుతున్నారు.ఒక్క ఆరోగ్యశ్రీలోనే రూ. కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. వీటితోపాటు అభివృద్ధి కమిటీ ఒత్తిడి మేరకు అధికారులు పలు ఏజన్సీ నిర్వాహకులతో కుమ్మక్కై రూ. కోట్ల నిధులు పక్కదోవ పట్టించారని విచారణలో గుర్తించినట్లు తెలిసింది. రుయాస్పత్రి నిర్వహణకు ఏడాదికి దాదాపు రూ. 24 కోట్ల నిధులు అవసరమవుతాయి. వీటిలో రూ. 5కోట్లకు పైగా పక్కదోవ పట్టినట్లు సమాచారం. వీటితోపాటు గడిచిన ఐదేళ్ల కాలంలో ఆరోగ్యశ్రీ, హెచ్‌డీఎస్‌కు సంబంధించి మరో రూ. 5 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగమైనట్లు తెలిసింది. వీటికి సంబంధించి ఇప్పటికే పలు కీలకమైన రికార్డులను ఆడిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఆరోగ్యశ్రీలో వైద్య సేవలకు ఏడాదికి సుమారు రూ. 5 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ ఖాతాలో జమవుతుంది. ఇందులో ఆరోగ్యశ్రీ వైద్య సేవల కింద అభివృద్ధి కమిటీ చెప్పిన వారికే వైద్య పరికరాలు, మందుల కొనుగోళ్ల పేరుతో దాదాపు ఏడాదికి రూ. 2 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. పది కోట్ల వరకు పక్కదోవ పట్టినట్లు అధికారులు గుర్తించారు. 2020-21వ సంవత్సరంలో ఓ అధికారి ఆరోగ్యశ్రీ నిధులు పక్కదోవ పట్టించి సస్పెండయ్యాడు. అప్పటి అధికారులు నిధులు పక్కదోవ పట్టించిన ఉద్యోగిని సస్పెండు చేశారు తప్ప నిధులు రికవరీ చేయలేదు. దీంతో ఆ ఏడాదికి సంబంధించిన రికార్డులను ప్రస్తుతం ఆడిట్ అధికారులు అడగ్గా రుయా అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు.చివరకు ఆ రికార్డులు లేవని చెప్పి జారుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ ఆసరా పేరుతో రోగులు కాని వారి పేరుతో దాదాపు రూ.3కోట్ల వరకు నిధులు దుర్వినియోగమైన విషయం కూడా ఆడిట్ అధికారులు గుర్తించారు.ఈ విషయం ఏడాది కిందట వెలుగులోకి రావడంతో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేసే డీఈవోలను ఇందుకు సూత్రధారులుగా చూపి సంబంధిత అధికారులను తప్పించారు.తరువాత ఈ విషయాన్ని గోప్యంగా వుంచేయడం వెనుక వైసీపీ నాయకుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ విషయంపై కూడా ఆడిట్ అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం.

ఆడిట్‌లో వెలుగుచూసిన విషయాలు

● పారిశుధ్య, సెక్యూరిటీ ఏజన్సీ నిర్వాహకులు తక్కువ మంది సిబ్బందిని నియమించి రికార్డుల్లో ఎక్కువ మందిని చూపుతున్నట్లు కూడా గుర్తించారు. వీరిలో ప్రధానంగా పారిశుధ్య ఏజన్సీ నిర్వాహకులు 205 మంది కార్మికులకు గాను 130 మందినే నియమించుకోవడంతో పాటు వారికి కూడా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని గుర్తించారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి చెల్లించకపోగా పారిశుధ్యానికి సంబంధించి ఎలాంటి సామాగ్రి కొనుగోలు చేయకనే నెలకు రూ.70 లక్షలకు పైగా బిల్లులు అందుకుంటున్నట్లు గుర్తించారు.

● సప్తవర్ణాల పేరుతో ఏజన్సీ నిర్వాహకులు ఆస్పత్రిలోని రోగుల పడకలపై రోజూ దుప్పట్లను మార్చాలి. కానీ వారానికి ఒకటి రెండు రోజులు మాత్రమే పడకలపై దుప్పట్లు మారుస్తున్నట్లు గుర్తించారు.

● సూపరింటెండెంట్ స్థాయి అధికారి వాడే వాహనానికి నెలకు రూ. 9 వేల లోపు మాత్రమే డీజల్‌కు ఖర్చు చేయాలి.అయితే గతంలో పనిచేసిన సూపరింటెండెంట్ నెలకు రూ. 15 వేలకు పైగా డీజల్‌కు ఖర్చు చేసిన విషయాన్ని ఆడిట్ అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి అప్పటి అధికారి నుంచి వివరణ తీసుకుని నిధుల రికవరీకి రంగం సిద్ధం చేస్తున్నారు.

● ప్రభుత్వం నుంచి ఏడాదికి రూ.3 కోట్ల విలువైన మందులు సరఫరా అవుతున్నా అదనంగా మందుల, వైద్య పరికరాల పేరుతో రూ. కోటికి పైగా నిధులు ఖర్చు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి రికార్డులు కూడా మాయమైనట్లు సమాచారం.

● హెచ్‌డీఎస్ కింద ఆస్పత్రి అభివృద్ధికి ఏడాదికి దాదాపు రూ. కోటి వరకు నిధులు మంజూరవుతాయి. వీటితోపాటు దుకాణాల నుంచీ అద్దెల రూపంలో మరో రూ. 30 లక్షల వరకు వస్తాయి. వీటిలో రూ. కోటికి పైగా నిధులను ఎలాంటి బిల్లులు లేకుండానే స్వాహా చేసినట్లు సమాచారం.

● ఆస్పత్రుల్లో కేవలం రెండు అంబులెన్సులు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఒకటి వీఐపీల కోసం ఉపయోగిస్తుండగా మరొకటి రోగుల కోసం ఉపయోగిస్తున్నారు. కానీ డీజల్ ఖర్చుల కింద ఏడాదికి రూ. 5 లక్షల నిధులను పక్కదోవ పట్టించిన విషయంపై కూడా ఆడిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. అలాగే వాహనాల రిపేర్లు, అధికారుల ఫోన్ల ఖర్చు, స్టేషనరీ పేరుతో రూ. పది లక్షలు స్వాహా చేసినట్లు కూడా ఆడిట్ అధికారులు గుర్తించారు.

● ఆస్పత్రిలో తలుపులు, కిటికీలు, మంచాలు, వీల్‌ఛైర్లు, ఫ్యాన్లు, ఏసీలు వంటివి రిపేరు చేసేందుకు ఏడాదికి రూ. 15 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు దస్త్రాల్లో చూపుతున్నా వాస్తవంగా వీటి నిర్వహణకు రూ. 5 లక్షలు కూడా ఖర్చు కాదని ఆడిట్ అధికారులు గుర్తించారు.వీటితో పాటు కార్యాలయంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విభాగంలో ఉన్న ఇద్దరు ఉద్యోగులు రూ. లక్షల నిధులను పక్కదోవ పట్టించడంలో ప్రధాన సూత్రధారులుగా వ్యవహరించినట్లు కూడా అధికారులు గుర్తించారు.

పంట్రాంగంలో జోరుగా కోడిపందేలు

● రోజూ చేతులు మారుతున్న రూ.లక్షలు



డైమండ్ డబ్బా

వాకాడు, ఏప్రిల్ 23:వాకాడు మండలంలోని మారుమూల గ్రామమైన పంట్రాంగం కేంద్రంగా కోడిపందేలు, డైమండ్ డబ్బా జోరుగా సాగుతున్నాయి. తడ, నాయుడుపేట,సూళ్లూరుపేట, ఆరంబాకం, శ్రీకాళహస్తి ప్రాంతాల నుంచి పందెంరాయుళ్లు వందల సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు.అనుమానం రాకుండా వారంలో మూడు రోజులు ఒక చోట, నాలుగు రోజులు మరో ప్రాంతంలో పందేలు నిర్వహిస్తున్నారు.పందేల కోసం రోజూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం.చిన్నతోట గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కనుసన్నల్లో పందేలు జరుగుతున్నట్లు సమాచారం.నిర్వాహకులతో కొంతమంది పోలీసులు కుమ్మక్కు కావడంతో స్థానికులు ఎవరైనా కోడి పందేలు జరుగుతున్నాయన్న సమాచారం పోలీసులకు ఇస్తే ఆ విషయం వెంటనే నిర్వాహకుడికి తెలిసిపోతోందన్న ఆరోపణలున్నాయి.పందెంరాయుళ్లు అక్కడినుంచి వెళ్లిపోయాకే పోలీసులు తూతూమంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారని స్థానికులు చెప్పుకుంటున్నారు. కోడిపందేల స్థావరాల పక్కనే డైమండ్ డబ్బా కూడా ఏర్పాటు చేస్తుండడంతో పందెంరాయుళ్ల జేబులు ఖాళీ అవుతున్నాయి.



కోళ్లతో పందెంరాయుళ్లు

ముగ్గురు హోంగార్డులపై చర్యలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 23 : నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ముగ్గురు హోంగార్డులపై ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ చర్యలు చేపట్టారు. అధికార పార్టీ నాయకులకు సహకరిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ముగ్గురినీ నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు.

టాయిలెట్లనూ వదలని కక్కుర్తి

● రెండు వైపులా దుకాణాల ఏర్పాటు
● రోజూ రూ.3వేలు ప్రజాప్రతినిధి జేబులోకి



ఎడమవైపున చిల్లర దుకాణం

తిరుపతి(కొర్లగుంట), ఏప్రిల్ 23: తిరుపతిలో కొంతమంది వైసీపీ ప్రజాప్రతినిధుల తీరు చూసి నగర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజల అవసరార్థం ఆర్టీసీ బస్టాండుకు ఉత్తరాన యూజ్ అండ్ పే టాయిలెట్ నిర్మించేందుకు విజయవాడకు చెందిన రవీంద్రనాథ్ స్వచ్ఛంద సేవా సంఘం ముందుకొచ్చింది. నగరపాలక సంస్థ నిబంధనల ప్రకారం దాదాపు రూ.20లక్షలతో అధునాతన సౌకర్యాలతో కూడిన మరుగుదొడ్ల కేంద్రం నిర్మించింది. అయితే ఈ నిర్మాణం తుది దశలో ఉన్నప్పుడు స్థానిక ప్రజాప్రతినిధి రంగంలోకి దిగారు. నిర్మాణం పూర్తయి, సజావుగా ప్రారంభం కావాలంటే మరుగుదొడ్ల కేంద్రానికి ఇరువైపులా పది అడుగులు విస్తరించి, ప్లాట్‌ఫామ్స్ రెడీ చేసివ్వాలని హుకుం జారీ చేశారు. చేసేదేమీలేక నిర్మాణదారులు సొంత ఖర్చుతో ప్లాట్‌ఫామ్స్ సిద్ధం చేశాకే ప్రారంభం సజావుగా సాగింది. ఆ తర్వాత కొద్దిరోజులకే ఆ ప్రజాప్రతినిధి తన అనుచరులతో అనధికారంగా తోపుడుబండిపై దుకాణాలు పెట్టించారు. ఓవైపు కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్, బీడీ, సిగరెట్, స్నాక్స్, పాన్‌పరాక్స్ వంటి 24గంటల చిల్లర వ్యాపార దుకాణం ఓ వ్యాపారికి, మరోవైపు టిఫిన్ సెంటర్‌ను ఉదయం, సాయంత్రం వేర్వేరుగా ఇద్దరు వ్యాపారులకు అప్పగించారు.ఒక్కో వ్యాపారి నుంచి రోజుకు రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.3వేలను వసూలు చేసుకుంటున్నట్లు తెలిసింది.



కుడివైపున టిఫిన్ సెంటర్

‘చక్రవర్తులు విడిది చేసిన చంద్రగిరి ప్రతిష్టను కాపాడుకునేందుకు ఓటరు సిద్ధమయ్యాడు.పదేళ్లుగా ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం గుప్పిట్లో వున్న చంద్రగిరి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే సమయం ఆసన్నమైంది. వైసీపీ నాయకులు పెద్దఎత్తున టీడీపీలో చేరుతుండటమే ఇందుకు నిదర్శనం. చంద్రగిరి చరిత్రలో టీడీపీ తరఫున రెండోసారి టికెట్ దక్కడం నా అదృష్టం. అందులోనూ మా బాస్ చంద్రబాబు స్వస్థలంలో పోయిన ప్రాభవాన్ని తిరిగి రప్పిస్తా.చంద్రగిరి కోటపై టీడీపీ జెండా రెపరెపలాడిస్తా’ అంటున్నారు టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థి పులివర్తి నాని. జనం ఆశీర్వదిస్తే చంద్రగిరిలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి, వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి తీరు గురించి ఆయన ఆంధ్రజ్యోతితో సంభాషించారు. అవన్నీ ఆయన మాటల్లోనే....

తిరుపతి
ఆంధ్రజ్యోతి



ఇంటర్వ్యూ

చెవిరెడ్డి పనైపోయింది!

చంద్రగిరి కోటలో పసుపు జెండా ఎగరేస్తా
టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని

జెండా మోసిన నాయకులను అణగదొక్కాడు

చెవిరెడ్డి అన్ని వర్గాలనూ దగా చేశాడు. ముఖ్యంగా రెడ్డి, ఎస్సీ సామాజికవర్గాలను దారుణంగా మోసం చేశాడు. 2014లో అధికారం లేనప్పుడు వాళ్ల ఆస్తులు అమ్మి సహకారం అందించారు. ఎస్ఆర్ఐలు వచ్చి ఎన్నికల నిర్వహణలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో పంచాయతీల, మండలాల రిజర్వేషన్లు మార్చి వారి నియంత్రణలో పెట్టుకున్నారు. ఎస్సీ పంచాయతీలను కూడా తారుమారు చేశారు. వాళ్ల కుటుంబానికి పోటీవుండకూడదని ఇష్టారాజ్యంగా మార్చేశారు. జెండా మోసిన నాయకులను అణగదొక్కారు.నీతిగా బతకడం, టీడీపీ కుటుంబ సభ్యులే నా బలమైతే చెవిరెడ్డి బలహీనత డబ్బు, నమ్మినవాళ్లను వంచించడం.

పెరిగిన ధరలతో కకావికలం

ఉప్పు నుంచి పప్పువరకు ధరలన్నీ పెరిగాయి. పామాయిల్ ప్యాకెట్ గతంలో రూ.80 ఉంటే ఇప్పుడు రూ.120కి పెరిగింది. కరెంటు బిల్లు రూ.300 నుంచి రూ.700కు చేరింది. చంద్రబాబు హయాంలో రూ.10వేలు సంపాదించే వ్యక్తి ప్రశాంతంగా బతికేవాడు. ఇప్పుడు రూ.20వేలు సంపాదించినా సరిపోవడంలేదు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన ధరాఘాతాన్ని వివరిస్తున్నాం. గతంలో చెవిరెడ్డి ఆర్థిక పరిస్థితి ఏంటి? ఇప్పుడేంటి? అని కూడా ఆలోచించమని చెబుతున్నాం. ఇసుక మాఫియా, మట్టి దందా, మఠం స్థలాల కబ్జాతో వేలకోట్లకు పడగలెత్తాడు. ఒక్క తిరుచానూరు పంచాయతీ నుంచే రూ.700కోట్లు దోచేశాడు. 68 ఎకరాలు వంక పోరంబోకులు, డీకేటీ భూములు ప్లాట్లు వేసి అమ్మేశారు. ప్రజలు కూడా క్లారిటీకి వచ్చారు, చెవిరెడ్డిని ఒకటికి రెండు సార్లు చూశాం. ఇక ఆయనకు ఓటు వేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పేస్తున్నారు.

చెవిరెడ్డి దాష్టీకం ఎలా వుంటుందంటే...

తిరుచానూరులో ఓ భూస్వామిని స్థల వివాదంలోకి నెట్టారు. చెప్పినమాట వినలేదని స్థానిక సర్పంచ్ సహకారంతో పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టి గుంజీలు తీయించారు.ఆయన కుమార్తె ఫోన్ చేసి తన తండ్రిని విడిచిపెట్టమని అభ్యర్థిస్తే, పర్సనల్‌గా ఫోన్ చేసి మాట్లాడితే చూస్తామని చెవిరెడ్డి అనుచరుడు అసభ్యకరంగా మాట్లాడాడు. ఇన్‌స్పెక్టర్‌పై బాధితులు ప్రైవేటుకేసు వేశారు. ఇలాంటి బాధితులు ఎందరో ఉన్నారు. చెవిరెడ్డిని ఓడించేందుకు పుస్తెలైనా అమ్ముతామని ఓ మహిళ నాతో చెబుతూ కన్నీటిపర్యంతమయ్యారు. పైకి కనిపించేటంత సౌమ్యుడు కాదు చెవిరెడ్డి. అతడి దురాగతాలు వెలుగులోకి రావాలంటే మరో నెల రోజులు పడుతుంది.

కిష్టం. తాయిలాలిచ్చి తనవైపు తిప్పుకోవాలన్న చీప్ పాలిటిక్స్ ఆయనవి. స్వీట్లు, చీరజాకెట్, వాచ్, కుక్కర్ ఇవన్నీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని శ్రీవారి దర్శనాల సిఫార్సులతో తెచ్చిస్తుంటారు. స్వీట్లు తెచ్చే బాధ్యత టీటీడీ కాంట్రాక్టర్‌ది. రిలయన్స్ నుంచి దుస్తులు, బిల్డర్లనుంచి కుక్కర్లు, వాచ్‌లు...ఇలా తలా ఒకటి ఒక్కొక్కరిపై భారం వేసి తాయిలాలు పంచి ప్రజలు తన బానిసలని చెప్పుకుంటుంటారు. ఎన్నికలవేళ కూడా భారీగానే ఇస్తారు. ఓటుకు రూ.10వేలు, ఇంటికి 6గ్రాముల బంగారు కూడా ఇస్తాడు. తీసుకోమని చెప్పాం. చంద్రబాబు మాకు అవినీతి నేర్పించలేదు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ఓటు మాత్రం ఆలోచించి వేయమని అభ్యర్థిస్తున్నాం.

● చిన్నప్పుడే చంద్రబాబు నా భుజం తట్టారు

1980 ప్రాంతంలో నేను ఐదవతరగతి చదువుతున్నప్పుడు చంద్రబాబు మంత్రి హోదాలో మా గ్రామానికి వచ్చారు. మా పెదనాన్న పూలమాల ఇస్తే నేనే ఆయనకు వేశా. అప్పుడే ఆయన నా భుజం తట్టారు. అది ఇప్పటికీ నాకు గుర్తుంది. మా తాతలనాటి కాలంనుంచి రాజకీయాల్లో ఉన్నాం. బ్రిటీష్ కాలంలో మాతాత పాపినాయుడు పెద్ద కాంట్రాక్టర్. లారీలు కూడా వుండేవి. మా పెదనాన్న రాజకీయాల్లో ఉండేవాడు. నేను చిన్నప్పుడే చిత్తూరు వెళ్లా. పాఠశాల విద్యనుంచి అక్కడే ఉన్నా. క్లాస్ లీడర్‌గా పని చేశా. కాలేజీలో స్టూడెంట్స్ యూనియన్‌కు నాయకత్వం వహించా. అప్పటినుంచే రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. 1989లో చంద్రబాబు నాయుడు చిత్తూరుకు వచ్చినప్పుడు ఆయనతో పాటు తిరిగాం. బోడేవాండ్లపల్లి, సదుంలో కొన్ని అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు స్కూటర్‌లో ఆయనతో పాటు ఫాలో అయ్యాం.

● అందరికీ ఇళ్లు ఇచ్చితీరుతాం

మంగళం హౌసింగ్ కాలనీలో 2018లో 2వేలు ఇళ్లు తీసుకొచ్చి తొలిదశలో 700 మందికి ఇచ్చాం.ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో 1300 ఇళ్లు పెండింగ్‌లో పడ్డాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినతర్వాత కేవలం 300 ఇళ్లు లబ్ధిదారులకిచ్చి మిగిలిన వారికివ్వకుండా చెవిరెడ్డి పక్కన పెట్టేశారు. కోర్టులో కేసు ఉందని దాటవేశారు. ఎక్కడో ఏర్పేడు మండలం చిందేపల్లిలో హౌసింగ్ కాలనీలో ఇస్తే వాళ్లకు ఏం ఉపయోగం ఉంటుంది. రోజువారీ పనులు చేసుకుని బతికేవాళ్లు అంత దూరం పోయిరావడం సాధ్యమేనా? సర్వే ఇన్‌స్టిట్యూట్‌కు కేటాయించిన 42 ఎకరాల్లో టిడ్కో ఇళ్లు కట్టించి వుంటే 4వేలు ఇళ్లు వచ్చివుంటాయి. అదేవిధంగా తిరుమలనగర్‌లో కమీషన్ తీసుకుని తుడా స్థలాన్ని లీజుకు ఇచ్చారు. ఇక్కడ కూడా టిడ్కో ఇళ్లు కట్టివుండొచ్చు.

● రైతులను చెవిరెడ్డి దగా చేశాడు

రైతులనూ చెవిరెడ్డి దగా చేశాడు. రామచంద్రా పురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పాకాల, చంద్రగిరి ప్రాంతాల్లో కొంతమంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఆదుకున్న పాపానపోలేదు.చంద్రబాబు హయాంలో ఉన్న డ్రిప్ ఇరిగేషన్ పక్కన పెట్టేశారు. టమోటా, వంకాయ, బెండకాయలు పండించే రైతులకు కోల్డ్ స్టోరేజీలు కట్టలేదు. దీంతో గిట్టుబాటుధరకు అమ్ముకోలేక పోతున్నారు. కాస్త మనసుపెడితే కేంద్ర ప్రభుత్వం కూడా కోల్డ్ స్టోరేజీలకు సహకరిస్తుంది.

● తలకోన బ్యాక్ వాటర్ తెప్పిస్తాం

పించాలో కలుస్తున్న తలకోన బ్యాక్ వాటర్‌ను కాలువల ద్వారా చిన్నగొట్టిగల్లుకు తీసుకురావొచ్చు. తద్వారా ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయొచ్చు. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే తలకోన బ్యాక్ వాటర్‌ను రప్పిస్తాం. రాయలచెరువు కట్ట తెగుతుందని ప్రచారం చేసి ఆ ప్రాంతంలో 16 పల్లెలకు నిద్రాహారాలు లేకుండా చేశారు. చెరువులో నీటి సామర్థ్యం పెరిగినప్పుడు లీకేజీలు రావడం సహజం.దాన్ని కూడా రాజకీయంగా వాడుకున్నారు. హెలికాప్టర్ తెప్పించి తన అనుచరులతో షికార్లు కొట్టించి నాలుగు రోజులు కట్టమీదే వేషాలు వేశాడు. మునక ప్రాంతాల్లో నేను కాలినడకన తిరిగి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవలందించా. చంద్రబాబు కూడా సందర్శించి రాయల చెరువును సాగునీటి ప్రాజెక్టుగా చేస్తామని హామీ ఇచ్చారు.

● తాయిలాలు పంచడమే చెవిరెడ్డికి తెలిసింది

చెవిరెడ్డికి తెలిసింది ఒక్కటే పచ్చని పల్లెల్లో విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడం. ప్రజలను బానిసలుగా చూడడమంటే ఆయన

చెవిరెడ్డి అవినీతి చక్రవర్తి

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి అవినీతి, అరాచకాలే మా ఎన్నికల నినాదం. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు, ఆ తర్వాత అరుణమ్మ హయాంలో చంద్రగిరి చాలా అభివృద్ధి చెందింది. చెవిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాక 2014 నుంచి అభివృద్ధి ఆగిపోయింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నేనే అభివృద్ధి చేయాలనుకున్నా చెవిరెడ్డి అడ్డుకునేవాడు. 2019లో నన్ను గెలిపిస్తే, చంద్రగిరిని హైదరాబాద్ సిటీగా మారుస్తా అన్నాడు. ఇప్పుడు పదవీకాలం అయిపోయింది. అభివృద్ధి ఊసేలేదు. యువతకు ఉద్యోగాలు లేవు. పేదలకు ఇళ్లు లేవు.జగనన్న కాలనీల పేరిట వైసీపీ ఇచ్చిన ఇళ్లలో 60 శాతం వాళ్ల నాయకులు, సిబ్బంది, గన్‌మెన్లు, సొంత మీడియా వాళ్లకు ఇప్పించుకున్నారు. నిజమైన లబ్ధిదారులకు మొండిచేయి చూపారు. మామండూరులో హౌసింగ్ కాలనీని 50 శాతం కూడా పూర్తిచేయలేదు. చెవిరెడ్డి చిత్తశుద్ధితో చేసివుంటే ఇళ్లసమస్య వుండేదే కాదు.

● చెవిరెడ్డి సంస్థల్లోకి తుడా నిధులు

వలంటీర్ వ్యవస్థను వాడుకోవాలని వాళ్లకు అదనంగా ఇచ్చి రిజైన్ చేయిస్తున్నారురు.అయితే వారిలో 60 శాతం వాళ్లకే వ్యతిరేకంగా ఉన్నారు. తుడా నిధులను చెవిరెడ్డి తన సొంత సంస్థల జేబుల్లోకి వేసుకున్నాడు. కేవీఎస్ ఇన్‌ఫ్రా, కేవీఎస్ అగ్రి, కేవీఎస్ అసోసియేట్ సంస్థలు తుడా నిధులతో ఎదిగాయి. తుడా నిధులతో ఏర్పాటైన సిట్టింగ్ బెంచీల్లోనే రూ.20 కోట్లు లాగేశాడంటే అతడి అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఒక్క బెంచీ తయారు చేసి ఇక్కడికి తెప్పించేందుకు రూ2800 ఖర్చవుతుంది. అలాంటిది ఒక్కో బెంచీకి రూ10.800 తుడా నిధులు వెచ్చించి, దాదాపు 30వేల బెంచీలు తెప్పించాడు.నియోజకవర్గంలో ఖాళీగా ఉన్నచోటంతా వైఎస్ఆర్ రోడ్డు పేరిట బోర్డులు రాయించి తనపేరు కింద వేసుకున్నారు.రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, జాతిపిత గాంధీ పేరుతో కూడా అన్ని రోడ్లు లేవు. నియోజకవర్గంలో వేసే సీసీ రోడ్ల నుంచి తన కేవీఎస్ ఇన్‌ఫ్రాకు 23 శాతం కమీషన్ రూపంలో ఇవ్వాలి.తుడా నిధులను ఎంపీడీవో కార్యాలయాలకు బదలాయించి, అడ్డగోలుగా దోచేశారు. కమీషన్లు తీసుకుని తుడా స్థలాలు లీజుకిచ్చేశారు, తిరుచానూరు చెరువు భాగం పెట్టుకుని లీజుకు అప్పగించేశారు. లేఅవుట్లలో కమీషన్, రిజిస్ట్రేషన్ శాఖలో కమీషన్, తుడా లేఅవుట్లలో మెయిన్ రోడ్లలో తక్కువ రేటుకు తీసుకుని పెద్దమొత్తంలో అమ్ముకోవడం.... ఇలా తుడాను అడ్డదిడ్డంగా తుడిచిపెట్టేశారు. దాదాపు రూ.80కోట్లు తుడా అప్పుల్లో ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన స్వంత ప్రయాణాలకయ్యే విమానటికెట్లు, వాహనాలు, సిబ్బంది, తుడా నిధులనుంచే. ఐదేళ్ళు తుడాను ఒక కల్పవృక్షంలా మార్చుకున్నారు. రూ.5వేల కోట్లు సంపాదించారు. హైదరాబాద్, విజయవాడల్లో విలాసవంతమైన విల్లాలు కొన్నాడు. పూణె, బొంబాయిలో స్థలాలున్నాయి. డబ్బులు అడ్డగోలుగా సంపాదించేశారు.మేం వచ్చాక తిన్నదంతా కక్కిస్తాం.

● ఫేక్ ఓటర్ల కారకులను వదిలిపెట్టం

ఫేక్ ఓటర్లకు చాలావరకు అడ్డుకట్ట వేశాం. అధికారంలోకి వచ్చినతర్వాత ఫేక్ ఓటర్ల సృష్టికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకుంటాం. చంద్రబాబు మా ఇంటికి పరామర్శకు వచ్చినప్పుడు చంద్రగిరి దొంగ ఓట్లను కేస్ స్టడీగా తీసుకుంటామని చెప్పారు. అధికారంలో ఎవరున్నా వ్యవస్థ భ్రష్టుపట్టిపోకూడదు.

రేపు ‘పులివర్తి’ నామినేషన్
- వైసీపీ అభ్యర్థి నామినేషన్ వాయిదాపై అనుమానాలున్నాయన్న నాని

తిరుచానూరు, ఏప్రిల్ 23: చంద్రగిరి నియోజకవర్గం టీడీపీ తరఫున గురువారం నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే వైసీపీ అభ్యర్థి బుధవారం నామినేషన్ ప్రకటించి మళ్లీ గురువారానికి వాయిదా వేయడం చూస్తుంటే ఏదో కుట్ర జరుగుతోందన్నారు. టీడీపీ తరఫున మేము నామినేషన్ వేసే రోజు ఏదో అలర్లు సృష్టించి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడానికి వైసీపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రశాంతంగా పండుగ వాతావరణంలో జరుపుకోవాల్సిన నామినేషన్ ప్రక్రియను భయాందోళనల మధ్య నిర్వహించుకునే పరిస్థితిని అధికార పార్టీ తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ కార్యకర్తలు సమన్వయం పాటించి అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు కూడా ఇరుపార్టీలకు ఒకే రోజు అనుమతి ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత రిటర్నింగ్ అధికారి, పోలీసులపైనే ఉందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ఘర్షణకు దూరంగా ఉండాలని పులివర్తి నాని పిలుపునిచ్చారు.

టెన్త్ ఫలితాల్లో అగ్రస్థానం
- 98.08 శాతం ఉత్తీర్ణతతో మెరిసిన ఎర్రావారిపాలెం

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 23: పదో తరగతి ఫలితాల్లో ఎర్రావారిపాళెం మండలం జిల్లాస్థాయిలో 98.08 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. మారుమూలగా ఉండే ఈ మండలం అంటే గుర్తుకు వచ్చేది నక్సలిజం.. తర్వాత ఫ్యాక్షన్, ముఠా వర్గాలతో ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. మరికొందరు ఇల్లూ వాకిలి, పొలాలు వదిలి వలస బాట పట్టారు. నిరక్షరాస్యతా ఎక్కువగా ఉండేది. ఇదంతా 30ఏళ్ల కిందటి పరిస్థితి. ప్రస్తుతం జిల్లాస్థాయిలో అక్షరాస్యతలోనూ, సామాజికంగా, రాజకీయంగా ఎంతో పరిణతి సాధించింది. ఇందుకు నిదర్శనమే టెన్త్ ఫలితాలని స్థానికులు పేర్కొంటున్నారు.

ఏడు పాఠశాలల్లో వంద శాతం పాస్

పచ్చార్లవాండ్లపల్లె, కోటకాడ పల్లె, ఉస్తికాయలపెంట, వీఆర్ అగ్రహారం, బోడేవాండ్లపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో పరీక్షలు రాసిన విద్యార్థులంతా పాసయ్యారు. ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేయడంవల్లే వందశాతం ఫలితాలు వచ్చాయని ఎంఈవో సతీష్ పేర్కొన్నారు.

డిస్టిలరీల్లో అవకతవకలు జరిగితే చర్యలు: ఎస్పీ



డిస్టిలరీని తనిఖీ చేస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డిస్టిలరీల్లో ఏదైనా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ హెచ్చరించారు. రేణిగుంట మండలం కరకంబాడి వద్ద ఉన్న ఈశ్వర్ డిస్టిలరీని మంగళవారం తనిఖీ చేశారు. స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెబ్, పోలీసు అధికారులు తరచూ తనిఖీలు చేయాలని చెప్పారు. అదనపు ఎస్పీ రాజేంద్ర, రేణిగుంట డీఎస్పీ భవ్యశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సహస్ర చండీ హోమం



ప్రసంగిస్తున్న సిద్ధేశ్వరానంద భారతిస్వామి

రామచంద్రాపురం, ఏప్రిల్ 23: గత మూడురోజులుగా రాయల చెరువుకట్ట శ్రీశక్తిపీఠంలో నిర్వహించిన సహస్ర శత చండీ హోమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా మరకత శక్తి కాళీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహించిన అనంతరం 500 కేజీల అన్నంతో కూటోత్సవం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ నిర్వహించిన అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామి దేవీ వైభవాన్ని వివరించారు. అలాగే రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయం వద్ద పౌర్ణమి సందర్భంగా స్వామి అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ఉదయం 9గంటలకు చండీ హోమం నిర్వహించి, 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు.

చంద్రగిరి

పులివర్తి నానీ గెలుపే లక్ష్యం

భాకరాపేట, ఏప్రిల్ 23: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కొట్టే శివకుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం వలసారెడ్డిగారిపల్లె, తొగటపల్లె, లంకిపల్లివారిపల్లె, బొల్లినేనివారిపల్లె గ్రామాల్లో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. నాయకులు మోహన్‌రెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, ఎర్రయ్య నాయుడు, గుర్రప్ప నాయుడు, నాగరాజా, రాజగోపాల్ నాయుడు, రెడ్డప్ప నాయుడు, వెంకటసుబ్బయ్య, బావాజాన్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం



చంద్రగిరి, ఏప్రిల్ 23: చంద్రగిరి కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక మండపంలోకి తీసుకొచ్చారు. 10 నుంచి 11.30 గంటల వరకు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబురాలతో అలంకరించి గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు చంద్రగిరి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, కంకణ బట్టర్ శ్రీనివాస భట్టర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం



చంద్రగిరి, ఏప్రిల్ 23: మండలం, శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న స్వామి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. మంగళవారం పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణచార్యులు, పార్థసారథి, జమేధర్ చిరంజీవి పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో నాయీ బ్రాహ్మణుల బాధలు వర్ణనాతీతం
- ఆత్మీయ సమ్మేళనంలో పులివర్తి నాని





సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి నాని, బొప్పరాజుపల్లెలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు

తిరుచానూరు, ఏప్రిల్ 23: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక నాయీ బ్రాహ్మణుల బాధలు వర్ణనాతీతమని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం ఎల్వీ కల్యాణ మండపంలో నాయీ బ్రాహ్మణుల సంఘం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పులివర్తి నాని మాట్లాడుతూ.. టీటీడీలో పనిచేస్తున్న 859మంది క్షురకులను స్థానిక పరిస్థితులను అనుసరించి పర్మినెంట్ చేయిస్తానని భరోసా ఇచ్చారు. శిథిలావస్థకు చేరుకున్న తిరుచానూరు కల్యాణ మండపాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్లలో ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు, నియోజకవర్గ అభివృద్ధి కోసం టీడీపీకి మద్దతు పలకాలని కోరారు.

బొప్పరాజుపల్లెలో వైసీపీకి షాక్

రామచంద్రాపురం మండలం అనుపల్లి పంచాయతీ బొప్పరాజుపల్లెలో వైసీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీ నేతలు మంగళవారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ్ రిసార్ట్స్‌లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో చేరినవారిలో చంద్ర, మునిరాజా, ప్రశాంత్, రమేష్, అజిత్, సిద్ధయ్య, రాజగోపాల్, మంగయ్య, సోము, గుండాలయ్య తదితరులున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

పాకాల: మండలంలోని కె.వడ్డేపల్లె పంచాయతీ, పంటపల్లె పంచాయతీల్లో మంగళవారం వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో కె.వడ్డేపల్లె పంచాయతీ సర్పంచ్ వరలక్ష్మి, విశ్రాంత తహసీల్దార్ రమేష్, తోటిహరిజనవాడకు చెందిన మహేష్, సుధీర్, చంద్ర, చంద్రబాబు, గురవయ్య, పురుషోత్తం తదితరులు, పోలిరెడ్డిగారిపల్లెకు చెందిన పి.శ్రీనివాసులు, శంకరయ్య, కేశవులు, సురేంద్రబాబు, రామచంద్రయ్య, కుమార్, నరేష్, పంటపల్లె పంచాయతీ వైస్ సర్పంచ్ కె.మదు, పి.నరసింహులు, పి.వెంకట్రామయ్య, కె.రవి, తదితరులు టీడీపీలో చేరారు.

చంద్రగిరి: చంద్రగిరి భారతీనగర్‌కు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు రంగారెడ్డి, గురుమూర్తిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, కుమార్‌రెడ్డి, గీత, జయంతి, సావిత్రి, అపర్ణ, హంవేణి, జ్యోతిప్రియ, సాయికుమార్, భువనేశ్వరి తదితరులు పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి నాని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలోకి వస్తున్న వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





కెవడ్డేపల్లెలో, చంద్రగిరి భారతీనగర్‌లో నాని సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

ఘనంగా గోవిందరాజస్వామి పొన్నకాల్వ ఉత్సవం



ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

తిరుచానూరు, ఏప్రిల్ 23: చిత్రపౌర్ణమిని పురస్కరించుకుని గోవిందరాజస్వామి వారి పొన్నకాల్వ ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 6గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, ఆండాల్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి, విష్వక్సేనుల వారు తొమ్మిది మంది దేవేరులతో కలిసి ఊరేగింపుగా తనపల్లి రోడ్డులోని పొన్నకాల్వ మండపానికి చేరుకున్నారు. 9నుంచి 11గంటల వరకు స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సేవాకాలం, శాత్తుమొర, ఆస్థానం, ఊంజల్‌సేవ నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు గోవిందరాజస్వామివారు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పూజలు ముగించుకుని తిరిగి గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకోవడంతో పొన్నకాల్వ ఉత్సవం ముగిసింది. డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

చంద్రగిరిలో మూడు ఇళ్లలో చోరీ...

చంద్రగిరి, ఏప్రిల్ 23: చంద్రగిరి పట్టణంలో సోమవారం రాత్రి మూడు ఇళ్లలో చోరీ జరిగింది. చంద్రగిరి పట్టణంలోని ముకుందవీధిలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు మూడు ఇళ్లలో చోరీ చేశారు. వేసవి కాలం కావడంతో అందరూ మిద్దెలపైన పడుకుని నిద్రిస్తుండగా చోరీ జరిగింది. మంగళవారం ఉదయం బాధితులు తమ ఇళ్లలోకి రావడంతో ఇంటి తాళాలు పగలగొట్టి, ఇంట్లో వస్తువులు చిందర వందరగా ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ముకుందవీధికి చెందిన సురేష్‌రెడ్డి ఇంట్లో 80 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలు, ప్రతాప్‌రెడ్డి ఇంట్లో వెండి వస్తువులు, బాలయ్య ఇంట్లో సుమారు రూ.లక్ష నగదు చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు చంద్రగిరి పోలీసులు కేసు విచారిస్తున్నారు.

470 గ్రాముల బంగారు చోరీ

రామచంద్రాపురం, ఏప్రిల్ 23: మండలంలోని సి.రామాపురం పంచాయతీకి చెందిన బ్రేవ్లీ హిల్స్ విల్లా సముదాయం ప్లాట్ నెంబర్ 69లో 470 గ్రాముల బంగారాన్ని దొంగ దోచుకెళ్లాడు. చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్ కథనం మేరకు.. టీటీడీ విశ్రాంత ఉద్యోగి లూథర్ నివాసం ఉంటున్న ప్లాట్ నెంబర్ 69లో సోమవారం అర్ధరాత్రి దొంగ ప్లాట్‌లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డాడన్నారు. మంగళవారం బాధితుడు లూథర్ కుమారుడు రాబర్ట్ సందీప్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరును క్లూస్‌టీంలు పరిశీలించాయి. రాబర్ట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఘటనాస్థలాన్ని చంద్రగిరి సీఐ రామయ్య, సిబ్బంది సుధాకర్‌రెడ్డి, త్యాగరాజులు, ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ మదన్‌మోహన్ పరిశీలించారు.

సీఐ గంగిరెడ్డిపై ఎట్టకేలకు వేటు

● పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని సీఈసీ ఆదేశం

● టీడీపీ నాయకుల ఫిర్యాదుతో స్పందించిన సీఈసీ

చిత్తూరు, ఏప్రిల్ 23: వైసీపీకి అనుకూలంగా ఉంటూ మంత్రి పెద్దిరెడ్డి మనిషిగా ముద్రపడిన సీఐ గంగిరెడ్డి మీద ఎట్టకేలకు వేటు పడింది. చిత్తూరుజిల్లా ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న ఆయన్ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం బదిలీ చేసింది. వెంటనే పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. పుంగనూరు సీఐగా సుదీర్ఘకాలం పని చేసిన గంగిరెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించారని, నామినేషన్లు వేసిన ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించి విత్‌డ్రా చేయించారని ఆరోపణలు ఉన్నాయి. ఆయన సమక్షంలోనే వైసీపీ నేతలు నామినేషన్లను చించేసిన ఘటనలున్నాయి. ఈ క్రమంలో అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆయన్ను ఎన్నికల విధుల నుంచి తప్పించి, బదిలీ చేసింది. పెద్దిరెడ్డి అండతో మళ్లీ అయన పుంగనూరుకే వచ్చారు. జిల్లాలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా ఎన్నికల నేపథ్యంలో ఆయన జిల్లా వదలిపోలేదు. లూప్‌లైన్ పేరుతో ఎస్పీకి దగ్గరగా ఉండే స్పెషల్ బ్రాంచ్ విభాగంలో కూర్చున్నారు. ఈ విభాగంలో ఉన్న తనకంటే పైస్థాయి అధికారికి తెలియకుండా 14 మంది అనుకూల సిబ్బందితో స్పెషల్ టీమ్‌ను సిద్ధం చేసుకున్నారు. గంగిరెడ్డితో పొసగక పై స్థాయి అధికారి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో స్పెషల్ బ్రాంచ్ విభాగానికి గంగిరెడ్డి చీఫ్‌గా మారి ఏకపక్షంగా పని చేయాలంటూ జిల్లాలోని పోలీసు అధికారులకు హుకుం జారీ చేసినట్లు ఆరోపణలున్నాయి. కొత్తగా వచ్చిన ఎస్పీ మణికంఠ చందోలు గంగిరెడ్డి అంశాన్ని పరిశీలించి స్పెషల్ బ్రాంచ్ నుంచి ఎన్నికల విభాగానికి బదిలీ చేశారు. ఎన్నికల సమయంలో గంగిరెడ్డి ఇలా లూప్‌లైన్ పేరుతో జిల్లాలోనే కొనసాగితే ఇబ్బంది అవుతుందని, గతంలో ఆయన వ్యవహరించిన తీరును ఉదహరిస్తూ టీడీపీ నేతలు ఎన్నికల సంఘానికి వరుస ఫిర్యాదులు చేశారు. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం గంగిరెడ్డికి పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలిచ్చింది.

ఆంగ్ల భాషా దినోత్సవం

పాకాల, ఏప్రిల్ 23: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సురేంద్రబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆంగ్ల అధ్యాపకుడు రమేష్, అధ్యాపకులు మాశిలామణి, మోహన్ బెహర, మాధవి, ఈశ్వరబాబు, రమణమ్మ,చిట్టికళావతి, ఆదిశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి

టెన్త్ ఫలితాల్లో 'భాష్యం' విజయకేతనం



విద్యార్థులతో జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్, టీచర్లు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 23: పదో తరగతి ఫలితాల్లో భాష్యం స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి.. విజయకేతనం ఎగురవేశారని జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ పేర్కొన్నారు. దీపకశ్రీ 597, ప్రేమ్‌కుమార్, అబ్దుల్ ఫైజాన్ 593, జాహ్నిత, హరజీత్‌రెడ్డి 592, వేదికకృష్ణ, తనీష్ 590మార్కులతో ప్రతిభ చాటారని తెలిపారు. ఏడుగురు విద్యార్థులు 590కిపైగా, 67మంది 550కిపైగా, 141మంది 500కిపైగా మార్కులు సాధించారన్నారు. వీరిని ప్రిన్సిపాల్స్, టీచర్లు అభినందించారు.

టెన్త్ ఫలితాల్లో 'విశ్వం' వందశాతం ఉత్తీర్ణత



విద్యార్థులతో విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి తదితరులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 23: వరదరాజనగర్, జీవకోనలోని విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారని చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. గణితం సబ్జెక్టులో రెడ్డి చరణ్‌రెడ్డి, యశ్వంత్, అఖిలేష్, మధుప్రియ, చైతన్య, కోమల్‌కుమార్, శశాంక్‌రెడ్డి, శివకృష్ణలు వందకి వంద మార్కులు సాధించి సత్తా చాటారని తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ విశ్వ తులసి, అకడమిక్ డైరెక్టర్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ అభినందించారు.

గ్రాడ్యుయేషన్ డే: జీవకోనలోని విశ్వం హైస్కూల్లో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే మంగళవారం జరిగింది. ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) ఎం.కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

తిరుమల ఘాట్‌లో కారును ఢీకొన్న బస్సు

స్వల్పగాయాలతో బయటపడిన హైదరాబాదు భక్తులు





ధ్వంసమైన వాహనాలు

తిరుమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌లో ఆగి ఉన్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హైదరాబాదుకు చెందిన ఆరుగురు కుటుంబీకులు శ్రీవారి దర్శనం కోసం తమ కారులో మంగళవారం తిరుపతికి చేరుకున్నారు. మధ్యాహ్నం అలిపిరిలో తనిఖీలు పూర్తయ్యాక తిరుమలకు బయల్దేరారు. వినాయక స్వామి ఆలయం దాటాక ఓ మలుపువద్ద సాంకేతిక సమస్యతో కారు ఆగింది. కొంతసేపటికి ఓ ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆగి ఉన్న కారును ఢీకొంది. దీంతో కారు రోడ్డుపై నుంచి ముందుకు దూసుకువెళ్లింది. అదృష్టవశాత్తూ కారులోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు వెనుక భాగం భారీగా ధ్వంసమైంది. బస్సు ముందు అద్దం పగలడంతోపాటు ముందుభాగం స్వల్పంగా ధ్వంసమైంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు మంగళవారం తెల్లవారు జామున ఐదు గంటలకు తమిళనాడుకు చెందిన ఓ కారు జీఎన్సీ టోల్‌గేట్ వద్ద డివైడర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో భక్తులెవ్వరికీ గాయాలవలేదు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి మంగళవారం ప్రకటించింది. సోమవారం 62,894 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,894 మంది తలనీలాలు సమర్పించారు.

హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలతో
స్విమ్స్ ఒప్పందం

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 23 : హెల్త్ ఇన్సూరెన్స్ కలిగిన రోగులకు సైతం నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు ఇన్సూరెన్స్ నెట్‌వర్క్ హాస్పిటల్‌గా స్విమ్స్ నమోదు చేసుకుందని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో 19 ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలతో స్విమ్స్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 0877-2287777 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

జీవకోనలో వైసీపీకి గడ్డుకాలమే

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 23: తిరుపతి నగర పరిధిలోని జీవకోన(46, 47, 48, 49 డివిజన్ల పరిధి)లో వైసీపీకి ఇక గడ్డుకాలం ఎదురుకానుంది. జీవకోనలో తమకంటూ ఓ గుర్తింపు ఉన్న అన్నా రామకృష్ణయాదవ్ కుటుంబం మళ్లీ చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ కుటుంబం టీడీపీ హయాంలో సర్పంచులుగా పని చేసిన సమయంలో ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పరచుకున్నారు. వీరి రాకతో టీడీపీకి ఈ ప్రాంతంలో పూర్వవైభవం రానుంది. 2019 ఎన్నికలకు ముందు అన్నా రామచంద్రయ్యయాదవ్, రామకృష్ణయాదవ్(అన్నా బ్రదర్స్)లు జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. అయితే వారికి వైసీపీలో తగినంత ప్రాధాన్యం లేకపోవడంతో అక్కడ ఇమడలేక తిరిగి టీడీపీ గూటికి చేరుకున్నారు. అన్నా రామకృష్ణయాదవ్‌తోపాటు ఆయన సతీమణి అన్నా మల్లీశ్వరి, 48, 49 డివిజన్ కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య, మాజీ ఎంపీటీసీలు, పలువురు డివిజన్ స్థాయి నాయకులు టీడీపీలో చేరారు. జీవకోన పంచాయతీగా ఉన్న సమయంలో 18వేల ఓట్లుండేవి. ప్రస్తుతం జీవకోన నాలుగు డివిజన్లుగా ఏర్పాటు అయింది. ఇపుడు 29వేల ఓట్ల వరకు ఉన్నాయి. 2002-07 మధ్య అన్నా రామకృష్ణయాదవ్ టీడీపీ సర్పంచ్‌గా జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో రెండో స్థానంలో నిలిచారు. అదే విధంగా 2007-12 మధ్య ఆయన సతీమణి అన్నా మల్లీశ్వరి ఏకగ్రీవంగా టీడీపీ సర్పంచ్ అయ్యారు. ఐదుగురు ఎంపీటీసీలను కూడా గెలిపించుకోవడంలో వీరు ఎంతో కీలకంగా వ్యవహరించారు. రెండేళ్ల ముందు జరిగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా వారి కుటుంబం నుంచి అన్నా అనిత, అన్నా సంధ్యలు 48, 49 డివిజన్ల కార్పొరేటర్లుగా గెలుపొందారు. (48వ డివిజన్ ఏకగ్రీవం అయింది.)

ప్రభావం చూపనున్న అన్నా కుటుంబం

జీవకోన నిర్మాణంలో అన్నా రామచంద్రయ్యయాదవ్ కీలకపాత్ర పోషించగా, ఆ ప్రాంత అభివృద్ధికి అన్నా రామకృష్ణయాదవ్ కృషి చేశారు. ప్రస్తుతం జీవకోనలో 29వేల ఓట్లుండగా.. ఎప్పుడు కూడా వివిధ ఎన్నికల్లో టీడీపీ దాదాపు 6,500 పైచిలుకు మెజార్టీ చూపిస్తుండేది. అన్నా కుటుంబం వైసీపీలో చేరడంతో ఆ మెజార్టీ 2019 ఎన్నికల్లో 350కి తగ్గింది. ఈ నేపథ్యంలో తిరిగి జీవకోనలో టీడీపీ హవా కొనసాగనుంది. ప్రస్తుతం తిరుపతి ఎమ్మెల్యే సీటు ఉమ్మడి కూటమి అభ్యర్థి జనసేనకు చెందిన ఆరణి శ్రీనివాసులుకు ఇవ్వడంతో ఆయన గెలుపు కోసం పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నారు. కాగా.. జీవకోనతోపాటు కొర్లగుంట పరిధిలోని సంజయ్‌కాలనీ, నవోదయకాలనీ, చంద్రశేఖర్‌రెడ్డికాలనీ, సుభాష్‌నగర్, మిట్టూరు ప్రాంతాల్లోనూ వీరి ప్రభావం ఉండనుంది.

ఎన్డీయే ప్రభంజనాన్ని ఆపలేరు
కూటమి నేతలు ఆరణి, వరప్రసాద్, సుగుణమ్మ





టీడీపీ, బీజేపీ నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న ఆరణి శ్రీనివాసులు - ర్యాలీలో నేతలు

తిరుపతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభంజనాన్ని ఎవ్వరూ ఆపలేరని తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ స్పష్టం చేశారు. ఆరణి నామినేషన్ ప్రక్రియలోనే కూటమి సత్తా ఏంటో ప్రత్యర్థులకు తెలిసివచ్చిందన్నారు. ఆరణి నామినేషన్ సందర్భంగా మంగళవారం ఎన్టీఆర్ స్టేడియం నుంచి మొదలైన ర్యాలీలో నగరంలోని 50 డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు వెంట నడిచారు. మండే ఎండను కూడా లెక్కచేయకుండా టీడీపీ, బీజేపీ, జనసేన జెండాలను రెపరెపలాడించారు. ఎదురుగా వస్తున్నవాళ్లను పలకరిస్తూ గాజు గ్లాసు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద పండ్లతో కూడిన గజమాలను వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మూడు గంటల పాటు సాగిన ర్యాలీ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం సమీపానికి చేరుకోగా, బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ కలిశారు. అనంతరం ఎన్నికల నిబంధనల మేరకు అభ్యర్థితోపాటు టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, బీజేపీ నాయకుడు భానుప్రకాష్ రెడ్డి, జనసేన నాయకుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ నామినేషన్ దాఖలుకు అనుమతించారు. మధ్యాహ్నం 2.05 గంటలకు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అదితి సింగ్‌కు ఆరణి అందజేశారు. కాగా, ఆరణి సత్యవతి కూడా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయ్ కుమార్, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, శ్రీధర్‌వర్మ, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్ యాదవ్, అన్నా రామకృష్ణ, కార్పొరేటర్ సంధ్యా యాదవ్, చినబాబు, మహేష్ యాదవ్, పాటకం వెంకటేష్, కంకణాల రజనీకాంత్, ఊట్ల సురేంద్ర నాయుడు, ఆర్సీ శ్రీనివాస్, మునిశేఖర్ రాయల్, సుబ్బు యాదవ్, ఆముదాల తులసీరాం, రుద్రకోటి సదాశివం, బీజేపీ నాయకులు శాంతా రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, చంద్రప్ప, పొనగంటి భాస్కర్, సామంచి శ్రీనివాస్, పెనుబాల చంద్రశేఖర్, వరప్రసాద్, సుబ్రహ్మణ్యం యాదవ్, ముని సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, పొలకల మల్లికార్జున్, ఆకేపాటి సుభాషిణి, కీర్తన, ఆనంద్, కిరణ్ రాయల్, బండ్ల లక్ష్మీపతి రాయల్, గుత్తా నాగరాజు రాయల్ తదితరులు పాల్గొన్నారు.



జనసేన తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు నామినేషన్ సందర్భంగా మంగళవారం ఆయనకు మద్దతుగా కందాటి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

తిరుపతి మోదీ!



తిరుపతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జనసేన తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు నామినేషన్ ర్యాలీలో ప్రధాని మోదీ వేషధారణలో ఆర్సీ కుమార్ నాయుడు ఆకట్టుకున్నారు. సైకిల్ తొక్కుతూ అలరించారు. ఇంతకూ ఈయన ఎవరా అని కూటమి నేతలు ఆరా తీశారు. కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణకు స్వయాన తమ్ముడు అని తెలియడంతో 'తిరుపతి మోదీ' అంటూ ఆర్సీ కుమార్ నాయుడితో ఫొటోలు తీసుకున్నారు.

ఎమ్మెస్సీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 23: ఎస్వీయూ పరిధిలో గతేడాది సెప్టెంబరులో నిర్వహించిన ఎమ్మెస్సీ రెండో సెమిస్టర్, ఎంసీఏ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. అలాగే, గతేడాది సెప్టెంబరులో నిర్వహించిన ఎమ్మెస్సీ జాగ్రఫీ నాల్గవ సెమిస్టర్, ఫిబ్రవరిలో నిర్వహించిన బీఈడీ రెండో సెమిస్టర్ ఫలితాలు కూడా విడుదల చేశారు. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 23: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఎస్వీయూనివర్సిటీ క్యాంపస్ స్కూల్ నిలిచిందని వీసీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. టెన్త్ ఫలితాల్లో క్యాంపస్ స్కూల్ 96.2 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ప్రతిభ చూపిన విద్యార్థులను తన చాంబర్‌లో అభినందించారు. రిజిస్ట్రార్ హుస్సేన్, హెచ్ఎం షకీన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 23: తిలక్‌రోడ్‌లోని ఓ టూవీలర్ షాపులో ఎలక్ట్రీషియన్ మెకానిక్ రమేష్ పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తూ చేయి నరాలు దెబ్బతినడంతో ఆస్పత్రిలో చేరాడు. అప్పటినుంచి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో టూ వీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రూ.10వేల సాయం చేశారు. జలంధర్, ప్రభు, గురునాథ్ ఆచారి, సోమనాథ్, తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలన్నదే ఎన్డీఏ లక్ష్యం

● తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు





ప్రజలకు అభివాదం చేస్తున్న వరప్రసాద రావు - తన భర్త వరప్రసాదరావుకు ఓటు వేయమని అభ్యర్థిస్తున్న ఆయన సతీమణి కొల్లూరి లక్ష్మి

తిరుపతి, (ఉపాధ్యాయనగర్/శ్రీకాళహస్తి) ఏప్రిల్ 23: అవినీతి నిర్మూలన, దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలన్నదే ఎన్డీఏ కూటమి లక్ష్యమని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. మంగళవారం తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తిరుపతి వీధుల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు మాట్లాడుతూ అవినీతి లేని సమాజం కోసం ఎన్డీఏ పనిచేస్తుందన్నారు. అందుకే ప్రజలు ఎన్డీఏ కూటమికి విజయాన్ని అందించబోతున్నారన్నారు. తాను ఎంపీగా ఐదేళ్లు ఇక్కడ పని చేశానని, ఆ సమయంలో తాను చేసిన అభివృద్ధి పనులు తప్ప ఈ ప్రభుత్వంలో జరగలేదని స్థానికులు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. అభివృద్ధి ఎలా ఉంటుందో తాను గెలిచిన తరువాత చేసి చూపిస్తానంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఆయన సతీమణి కొల్లూరి లక్ష్మి మిట్టవీధిలో గడపగడపకు తిరుగుతూ బీజేపీ, జనసేన అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

బీసీలకు అండగా ఎన్డీఏ కూటమి

బీసీలకు అండగా ఉండేది బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జయహో బీసీ సభ జరిగింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌ను, ఎంపీ అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కోలాహలంగా హనుమాన్ విజయోత్సవ యాత్ర



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కూటమి అభ్యర్థి ఆరణి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 23: వనవాసంలో ఉండగా రావణుడు సీతను అపహరించగా, ఆమె జాడ కోసం రాముడు అనేక ప్రయత్నాలు చేయగా, చివరకు హనుమంతుడు లంకలో ఉన్న సీతమ్మ జాడ తెలుసుకుని శ్రీరాముడికి తెలిపిన రోజుకు గుర్తుగా మంగళవారం భజరంగదళ్ హనుమాన్ విజయోత్సవ యాత్రను నిర్వహించింది. తిరుపతిలోని ఎంఆర్‌పల్లె సర్కిల్ నుంచి, బాలాజీకాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, గాంధీరోడ్డు, నాలుగుకాళ్ల మండపం, తిలక్ రోడ్డు, వీవీ మహల్ రోడ్డు, అన్నారావు సర్కిల్ మీదుగా కపిలతీర్థం వరకు యాత్ర సాగింది. ఇందులో భజరంగదళ్ కార్యకర్తలు, విశ్వహిందూపరిషత్, బీజేపీ, ఆర్ఎస్ఎస్ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దారి పొడవునా హనుమాన్ కీర్తనలు, భజనలు, నృత్యాలతో సందడి చేశారు. జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలు మిన్నుముట్టాయి. బీజేపీ నేతలు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్, ఏబీవీపీ నిర్వాహకుడు సుమన్, తిరుపతి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, యువత పాల్గొన్నారు. పలువురు కళాకారులు రామ, హనుమ వేషాలతో అలరించారు.



రైల్వే ప్రయాణికులకు తాగునీటి వసతి

తిరుపతి సెంట్రల్ ఏప్రిల్ 23: తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ప్లాట్‌ఫారాలపై తాగునీటి వసతి అంతంత మాత్రంగా ఉంది. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రయాణికులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ చర్యలు తీసుకున్నారు. రైల్వేస్టేషన్‌లోని ఎస్ఎంఆర్ కార్యాలయం సమీపంలో చల్లటి తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. ఎస్ఎంఆర్ అధికారి చిన్నప్పరెడ్డి, ఐపీఎఫ్ మధుసూదన్, జీఆర్పీ సీఐ హేమసుందర్‌రావు పాల్గొన్నారు.

రుయాస్పత్రిలో ద్విచక్ర వాహనం చోరీ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 23: రుయాస్పత్రిలోని కంటి విభాగంలో విధులు నిర్వహించే డాక్టరు పురుషోత్తంకు చెందిన ద్విచక్ర వాహనం మంగళవారం చోరీకి గురైంది. డాక్టరు రోజులాగానే ద్విచక్ర వాహనాన్ని కార్యాలయం ముందున్న పార్కింగ్ ప్రదేశం వద్ద నిలిపి, విధులకు వెళ్లారు. మధ్యాహ్నం వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. ఆస్పత్రిలోని సీసీ కెమెరాలను పరిశీలించగా, గుర్తు తెలియని వ్యక్తి తన వాహనాన్ని చోరీ చేయడాన్ని గుర్తించారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, నాలుగు నెలల్లో ఇప్పటివరకు మూడు ద్విచక్ర వాహనాలు ఆస్పత్రిలో చోరీకి గురయ్యాయి. నాణ్యత లేని సీసీ కెమెరాల వల్ల ఫుటేజీ స్పష్టంగా లేకపోవడంతో నిందితులను గుర్తించడం కష్టంగా ఉంటోందన్న విమర్శలున్నాయి.

తిరుమలేశుడి సేవలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ ఆర్ఎంటీ టీకా రామన్

తిరుమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎంటీ టీకా రామన్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి నైవేద్య విరామ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఫేక్ లింక్‌తో రూ.3.88లక్షలు కొట్టేశారు

రూ 3.58లక్షలు రికవరీ చేసిన సైబర్ క్రైం పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23: ఓ వ్యక్తి తన మొబైల్‌కి వచ్చిన ఫేక్ లింక్‌ను ఓపెన్ చేయడంతో రూ.3.88లక్షలను సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించడంతో రూ.3.58లక్షలను రికవరీ చేశారు. మంగళవారం వివరాలను ఎస్పీ కృష్ణ కాంత్‌పటేల్ ఆదేశాలతో సైబర్ క్రైం సీఐ వినోద్ కుమార్ మీడియాకు తెలిపారు. రేణిగుంటకు చెందిన గురుశేఖర్ అనే వ్యక్తి మొబైల్‌కి ఓ లింక్ వచ్చింది. అది ఫేక్‌లింక్ అని తెలియక బాధితుడు ఓపెన్ చేసిన కొద్ది సేపటికే తన ఐసీఐసీఐ బ్యాంకు క్రెడిట్ కార్డు నుంచి ఎనిమిది లావాదేవీల ద్వారా రూ.3.88 లక్షలు సైబర్ క్రైం నేరగాళ్లు డెబిట్ చేసేశారు. గంట తర్వాత విషయం తెలుసుకున్న బాధితుడు తిరుపతిలోని సైబర్ క్రైంపోలీసులను సోమవారం సాయంత్రం ఆశ్రయించాడు. సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బంది రంగంలోకి దిగి.. బాధితుడి క్రెడిట్ కార్డు ద్వారా ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లో మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. వెంటనే ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. అలాగే సంబంధిత వెబ్‌సైట్ నోడల్ అధికారికి విషయం తెలియజేసి, సైబర్ నేరగాళ్లు బుక్ చేసిన మొత్తం ఆర్డర్లు రద్దు చేయించి, రూ.3.58 లక్షలు రీఫండ్ అయ్యేలా చేశారు. మిగిలిన రూ.30,000 దర్యాప్తులో రికవరీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు. సైబర్ మోసాలపై బాధితులు 24 గంటల్లోగా 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

అటెండరు రూపాయి లంచం

- నైతిక బాధ్యత వహించి మద్రాసు ప్రావిన్స్ పీఎం రాజీనామా
- నాడు నైతిక విలువలకు పెద్దపీట వేసిన చిత్తూరుజిల్లావాసి

● చిరస్మరణీయులు



బొల్లిని మునస్వామి నాయుడు

తమపై వేల రూ.కోట్ల అవినీతి ఆరోపణలు వచ్చినా ఇప్పటి నేతలు పదవులను పట్టుకుని వేలాడుతూనే ఉన్నారు. అక్రమాస్తుల కేసులున్నా వెరవడంలేదు. పైగా నీతి బోధనలు చేస్తున్నారు. కానీ.. తన వద్ద పనిచేసే ఒక అటెండరు రూపాయి లంచం తీసుకున్నాడని మద్రాస్ ప్రావిన్స్ ప్రధానమంత్రి పదవికే రాజీనామా చేశారు బొల్లిని మునస్వామి నాయుడు. నాడు నైతిక విలువలు పాటించి.. నేటి తరానికీ ఆదర్శంగా నిలిచిన ఆయన చిత్తూరు జిల్లాకు చెందిన వారు. చిత్తూరు సమీపం వేపంజేరిలో 1885 ఏప్రిల్‌లో బొల్లిని మునస్వామి నాయుడు జన్మించారు. 1908లో న్యాయవాద వృత్తిలో డిగ్రీ పొందారు. సొంతంగా ప్రాక్టీస్ ప్రారంభించి మంచి పేరు పొందారు. 1920లో చిత్తూరు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా, 1918లో 16వ చిత్తూరు మండల మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా, 1921లో చిత్తూరు మున్సిపల్ చైర్మన్‌గా, 1923 నుంచి చిత్తూరు జిల్లా బోర్డు (జిల్లా పరిషత్) అధ్యక్షుడిగా పనిచేశారు. మద్రాసు విశ్వవిద్యాలయ సభ్యుడిగానూ కొనసాగారు. 1919-25 మధ్య మద్రాసు శాసనసభ సభ్యుడిగా, 1930లో మద్రాసు ప్రావిన్స్ ప్రధానమంత్రిగా ఎన్నికై 1934వరకు కొనసాగారు. అప్పట్లో ఈ పదవిని ప్రధానమంత్రి అనేవారు. తమ గ్రామాల సమీపంలోని అడవుల్లో పశువులు మేపుకొనేందుకు ఆయన అనుమతించారు. ఈయన ప్రధానమంత్రిగా పనిచేస్తున్న రోజుల్లో ఓ అటెండరు రూపాయి లంచం తీసుకున్నట్లు శాసనసభలో బయటపడింది. దీనిపై విచారణ జరిపితే నిజమని తేలింది. వెంటనే ఆయన ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి జట్కాబండిలో ఇంటికి వెళ్లారట. ఈయన మహోన్నత వ్యక్తిత్వాన్ని గుర్తించిన ఆంగ్లేయులు 1926లో 'దివాన్ బహదూర్' పురస్కారంతో సత్కరించారు.

- చిత్తూరు కలెక్టరేట్

లెక్క చెప్పాల్సిందే...

నోట్ దిస్ పాయింట్



ఎన్నికల సమయంలో బ్యాంకులోనే కాదు ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలపైనా ఎన్నికల అధికారులు కన్నేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా డిజిటల్ పేమెంట్లు ఎక్కువయ్యాయి. ఎన్నికల నేపథ్యంలో బ్యాంకు ఖాతాల్లో అనూహ్యంగా నగదు బదిలీలు, పరిమితికి మించి జమ, విత్‌డ్రాలు పెరగడంతో అధికారులు నిఘా తీవ్రతరం చేశారు. ఇందుకోసం బ్యాంకు, పోలీసు, ఐటీ విభాగం, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. బ్యాంకుల్లో లక్షకు మించి డబ్బు జమ, విత్ డ్రా చేస్తే వీరు దృష్టికి వెళుతుంది. రూ.10 లక్షలు మించి లావాదేవీలు జరిగితే ఆదాయ పన్ను శాఖకు వీరె సమాచారం అందిస్తారు. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం స్టాండర్డ్ పొజిషన్ పద్ధతిని రూపొందించారు. దీని ప్రకారం డిపాజిట్, విత్ డ్రాలతో పాటు డెబిట్, క్రెడిట్ కార్డులతోపాటు డిజిటల్ చెల్లింపులన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారు. ఎక్కువ సార్లు చిన్న మొత్తాల నగదు విత్‌డ్రా లావాదేవీలను పరిశీలించే ఓ వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా గ్రామీణ బ్యాంకుల్లో జీరో బ్యాలెన్సు ఖాతాలు, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలను సైతం నిశితంగా గమనిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల ముందు వరకూ లావాదేవీలు లేకుండా ఇప్పుడు అనూహ్యంగా పెరిగితే అందుకు కారణాలపై కూడా ఆరా తీస్తున్నారు.


- వెంకటగిరి/ డక్కిలి







జగన్ పాగాలి కబుర్లు



పారిశ్రామిక వాడ పేరిట జగన్ ఉత్తుత్తి శంకుస్థాపన చేసి గాలికొదిలేసిన వైనం అభాసుపాలైంది. టీడీపీ సేకరించిన భూముల్లోనే పరిశ్రమలొస్తున్నాయంటూ చేసిన ఆర్భాటం వైసీపీ మోసపు పోకడ తీరును బహిర్గతం చేసింది. తెలుగుదేశం హయాంలో పారిశ్రామిక పురోగతి జిల్లా ప్రజల్లో బలంగా నాటుకుందని జగన్ ప్రభుత్వం గుర్తించింది. దీంతో తామూ పరిశ్రమలను ఏర్పాటు చేయించినట్లు కలర్ ఇవ్వాలని భావించి భంగపడింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఏర్పేడు మండలం పాగాలి వద్ద సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ఇండస్ట్రియల్ పార్క్ బ్లాక్-2 స్థితిని తెలుపుతున్న బీడు భూములు.



మోసం గురూ!

- ఆర్నెళ్ల క్రితం ఇండస్ట్రియల్ పార్క్ పేరిట హడావిడి
- తాడేపల్లి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన
- ఐదు నెలలవుతున్నా అతీగతీ లేని ఏపీఐఐసీ
- పరిశ్రమలూ లేవు..రైతులకు పరిహారమూ లేదు
- టీడీపీ ప్రభుత్వంలోనే జరిగిన భూసేకరణ

సీఎం వర్చువల్ శంకుస్థాపన

ఏర్పేడు మండలం పాగాలి గ్రామం వద్ద ఇండస్ట్రియల్ పార్క్‌కు సంబంధించి రెండవ బ్లాక్ ఏర్పాటుకు గతేడాది నవంబరు 23న సీఎం జగన్ తాడేపల్లి నుంచీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హామీలిస్తూ అరచేతిలో వైకుంఠం చూపించారు. ఈ పారిశ్రామిక వాడకు కేంద్ర పరిశ్రమల శాఖ ద్వారా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద అనుమతులొచ్చాయన్నారు. ఈ కొత్త పార్కులో 44.11 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపట్టి మౌళిక సదుపాయాలు కల్పించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తామన్నారు. పార్కు అభివృద్ధికి కేంద్రం 70 శాతం వాటా కింద రూ. 7.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వాటా కింద రూ. 3.09 కోట్లు చొప్పున మొత్తం రూ. 10.33 కోట్లతో పనులు చేపడతామన్నారు. దీంతో సూక్ష్మ, చిన్న పరిశ్రమలు వచ్చేస్తున్నాయని చాలామంది భావించారు.

సీను కట్ చేస్తే..

ఐదు నెలలవుతున్నా పాగాలి పారిశ్రామికవాడ భూముల్లో అభివృద్ధి పనులు కాదు కదా ఇంతవరకూ ఏపీఐఐసీ అధికారులు కాలు కూడా పెట్టలేదు. శంకుస్థాపన నాటికి భూముల్లో రైతులు మినుము సాగు చేస్తున్నారు. నెల కిందట కోతలు పూర్తి చేశారు. ఇప్పుడా భూములు బీడుగా కనిపిస్తున్నాయి. కనీసం భూములకు సంబంధించి రైతులకు పరిహారమూ చెల్లించలేదు. అలాగని పరిశ్రమలకూ కేటాయించలేదు. పరిశ్రమలను రప్పించే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదు. ఆరు నెలల్లో ఎన్నికలున్నాయని ప్రభుత్వం గత నవంబరులో హడావిడి చేసింది. జిల్లాలో టీడీపీతో పోల్చుకుని ఒక్క పరిశ్రమ కూడా రాలేదని విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో సీఎం జగన్ ఉత్తుత్తి శంకుస్థాపన చేశారు. అది కూడా వర్చువల్‌గా. పరిహారం రాకపోవడంతో పంగూరు బాధిత రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, స్థానిక ఎమ్మెల్యే చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయారు. మెట్ట భూములు కావడంతో వర్షాధార పంటలు సాగు చేసుకుంటున్నారు.

టీడీపీ హయాంలోనే అంకురం

పాగాలిలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో 72 ఎకరాలను సేకరించింది. ఆ భూములు పంగూరు దళితులవి. అందులో 28 ఎకరాలను రాక్‌మెన్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించింది. ఆ పరిశ్రమ ఏర్పాటై ప్రస్తుతం నడుస్తోంది. ఇంకా 44 ఎకరాల భూమి మిగిలింది. గత ప్రభుత్వం సేకరించిన భూమిలో 37 ఎకరాలకు అప్పట్లోనే రైతులకు పరిహారం చెల్లించేసింది. మరో 35ఎకరాలకు రికార్డులు సక్రమంగా లేక పరిహారం చెల్లింపు పెండింగులో ఉంది.



మా కడుపు కొట్టి లాక్కున్నారు

మా కడుపు కొట్టి పంట పండే భూమిని లాక్కున్నారు. ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు. కాళ్లరిగేలా తిరుగుతున్నా ఈ ప్రభుత్వంలో ఎవరూ స్పందించడంలేదు. ఎవరికి చెప్పాలో తెలియక, పంటలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

- చెంగమ్మ, పాగాలి

భూముల జోలికొస్తే చావోరేవో తేల్చుకుంటాం



భూముల జోలికి వస్తే చావోరేవో తేల్చుకుంటాం. అప్పట్లో ఎకరాకు రూ.10లక్షలు పరిహారం ఇస్తామని స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో కొంతమందికి ఉద్యోగాలు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పరిహారం ఇవ్వలేదు. ఉద్యోగాలు ఇవ్వలేదు. రైతులను మాత్రం బెదిరిస్తున్నారు.

- నాగమ్మ, పాగాలి





పరిహారం ఇవ్వకుండా ఖాళీ చేయం

ఏపీఐఐసీ 2018లో భూములు తీసుకుంది. పరిహారం ఇవ్వలేదు. నేటికీ ఆ భూముల్లో వర్షాధార పంటలు పండించుకుని బతుకుతున్నాం. మూడు నెలల క్రితం కొంతమంది రెవెన్యూ అధికారులు వచ్చి భూములు వదలిపెట్టాలని భయపెడుతున్నారు. ఇది ఎక్కడి న్యాయమో అర్థం కావడంలేదు. పరిహారం ఇవ్వకుండానే భూములను వదలిపెట్టమని చెప్పడం బాధాకరం.

- రంగారెడ్డి, పాగాలి

చంద్రగిరి చరిత్ర



చంద్రబాబు పుట్టినగడ్డ

టీడీపీ అధినేత రాజకీయ కెరీర్‌కు శ్రీకారం ఇక్కడే

గల్లా అరుణకుమారి హ్యాట్రిక్ ఎమ్మెల్యే

దశాబ్దంన్నర పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబునాయుడి సొంతగడ్డ చంద్రగిరి నియోజకవర్గం. ఈ నియోజకవర్గం నుంచే ఆయన రాజకీయారంగేట్రం చేశారు. 1978లో కాంగ్రెస్ నుంచి ఆయన ఎమ్మెల్యేగా తొలిసారి ప్రాతినిధ్యం వహించారు. గల్లా అరుణకుమారి మూడుసార్లు వరుసగా కాంగ్రెస్ నుంచి గెలిచి హ్యాట్రిక్ సృష్టించారు. తిరుపతి, తిరుమల ప్రభావం కనిపించే చంద్రగిరి- ఆరంభం నుంచి ఇప్పటివరకూ పలుమార్లు పరిధులు మార్చుకుంది. 1952లో చంద్రగిరి నియోజకవర్గం జనరల్ కేటగిరిగా ఏర్పడింది. మూడేళ్ల తరువాత తవణంపల్లెగా మారింది. 1967లో బంగారుపాలెంగా మారింది. 1978లో తిరిగి చంద్రగిరి నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రగిరి, పాకాల, ఐరాల, తవణంపల్లె మండలాలతోపాటు తిరుపతి రూరల్ కొంత భాగం ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో కొంత మార్పులను సంతరించుకుని పరిధి విస్తృతం చేసుకుంది. ప్రస్తుతం చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, పాకాల, ఎర్రావారిపాలెం, తిరుపతి రూరల్ మండలాలు చంద్రగిరి నియోజకవర్గంలో ఉన్నాయి.

- చంద్రగిరి

ఎమ్మెల్యేలు

1952 ఎ.ఆదికేశవులు నాయుడు - కాంగ్రెస్
1978 -నారా చంద్రబాబునాయుడు - కాంగ్రెస్
1983- మేడసాని వెంకటరామనాయుడు- టీడీపీ
1985 - ఎన్ఆర్ జయదేవనాయుడు- టీడీపీ
1989- గల్లా అరుణకుమారి - కాంగ్రెస్
1994- నారా రామ్మూర్తి నాయుడు -టీడీపీ
1999, 2004, 2009- గల్లా అరుణకుమారి
2014, 2019 - చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి -వైసీపీ

మొత్తం ఓటర్ల సంఖ్య : 3,08,916
పురుషులు : 1,50,249
మహిళలు: 1,58,607, ఇతరులు: 60

చెవిలో పువ్వు



ఫిబ్రవరి నెలలో తిరుచానూరు రైతు బజారు ప్రారంభించి కూరగాయలు కొనుగోలు చేస్తున్న మోహిత్‌రెడ్డి



గేటు తెరుచుకోని రైతు బజారు

1 DAY రైతుబజార్ చూశారా..

- తిరుచానూరు రైతు బజారు ఒక రోజుకే మూత
- చెవిరెడ్డి మోహిత్ దర్శకత్వంలో ఫ్లాప్ షో

ఎన్నికల వేళ అధికార పార్టీ నేతలు జనం చెవిలో పెడుతున్న పువ్వులకు తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రైతు బజారు ప్రారంభమే నిలువెత్తు ఉదాహరణ. గతంలో సుమారు రూ.50లక్షలతో రైతు బజారు నిర్మించారు. 56మంది రైతులు వ్యాపారం చేసుకునేలా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో రైతు బజారు ప్రారంభించేసి ప్రజల్లో క్రెడిట్ కొట్టేయాలనుకున్నారు చంద్రగిరి వైసీపీ నాయకులు. వెంటనే దీన్ని ప్రారంభించేయాలని తుడా ఛైర్మన్, చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదరాబాదరాగా నిర్ణయించేశారు. ఇంకేముంది. ఈ ఏడాది ఫిబ్రవరి 14న ఆయనే స్వయంగా రిబ్బన్ కత్తిరించి రైతుబజారును ప్రారంభించేశారు. ఆ రోజు చుట్టుపక్కల ఉన్న రైతులను పిలిపించి కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయించారు. జనాలకంటే రాజకీయ నాయకులే ఎక్కువగా కొనుగోలు చేసేశారు. ఫోటోలు, వీడియోలు.. మీడియాకు గొప్పలు... అబ్బబ్బా... సినిమా షూటింగ్‌ను తలపించిందారోజు సన్నివేశం. అధిక ధరల గురించి చింతించాల్సిన అవసరం లేదు. రైతులు పంట అమ్మకం కాలేదని బాధపడాల్సిన పనిలేదు. పొలాల నుంచి నేరుగా రైతులు తెచ్చి ఈ రైతు బజారులో అమ్ముకోవచ్చు, తక్కువ ధరలకు ప్రజలు కొనుక్కోవచ్చంటూ మోహిత్ ఊదరగొట్టారు. తరువాత ఆయన అనుచరగణంతో కలిసి వెళ్లిపోయారు. రెండవ రోజుకే రైతు బజారు మూతపడింది. ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఎన్నికల స్టంటు అని తెలియని పరిసర ప్రాంత ప్రజలు మర్నాడు రైతు బజారు ఉందని వచ్చి ఉసూరుమంటూ వెనుతిరిగారు. వైసీపీ నేతల తీరుపై స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు. - తిరుచానూరు


సీన్-1

ఎప్పుడు : ఈ ఏడాది ఫిబ్రవరి 14న
ఎక్కడ : తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణ
కార్యక్రమం : రైతు బజారు ప్రారంభం
ప్రారంభించిన వారు : తుడా ఛైర్మన్, చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

సీన్-2

ఎప్పుడు : ఈ ఏడాది ఫిబ్రవరి 15న
ఎక్కడ : తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణ
రైతుబజార్ పరిస్థితి : కాయగూరలూ లేవు.. విక్రయాలూ లేవు





చెంబేడు చెరువు

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చుతాం. ఈ చెరువు పరిధిలోని గ్రామాల రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తాం. పంటలను సస్యశ్యామలం చేస్తాం.

2018 జనవరి 23వ తేదీన మండలంలో పాదయాత్ర నిర్వహించిన సందర్భంలో విపక్ష నేతగా జగన్ చెప్పిన మాటలివి.

జగన్ మాట నీటి మూట

- కార్యరూపం దాల్చని చెంబేడు రిజర్వాయర్
- 10 గ్రామాలకు సాగు, తాగునీరు ప్రశ్నార్థకమే

పెళ్లకూరు, ఏప్రిల్ 23: పెళ్లకూరు మండలంలోని చిన్నా, పెద్దా చెరువుల్లో కెల్లా తలమానికం చెంబేడు చెరువు. సుమారు 832.90 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ చెరువు పరిధిలో నందిమాల, చెన్నప్పనాయుడుపేట, ఆబాకవారికండ్రిగ, నల్లగుంటకండ్రిగ, అర్థమాల, ఉమ్మలగుంట, వడ్డిపాలెం, మారినేనిపాలెం, ఆర్లపాడు, గుర్రప్పనాయుడు గ్రామాల చెరువులున్నాయి. ఈ చెరువుల కింద సుమారు 3వేల ఎకరాల వరకు సాగు భూములున్నాయి. వర్షాధారంపై ఆధారపడి సాగు చేసుకుంటున్న రైతులు చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మారిస్తే రెండు పంటలు పండించుకోవచ్చు. అంతేకాదు సుమారు 20వేల మంది జనాభాకు తాగునీరు కూడా అందుతుందని సంబంధిత అధికారుల అంచనా.

నిరాశే మిగిల్చారు..: గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ పాదయాత్ర సమయంలో మండలానికి వచ్చారు.స్థానిక నాయకులతో పాటు రైతులు ఆయన్ను కలిశారు. చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని జగన్‌ను కోరారు. దీంతో ఆయన వెంటనే మాటిచ్చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల సమస్య తీరుస్తానన్నారు. చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోని వచ్చాక ఆయన ఆ ఊసే పట్టించుకోలేదు. 2021లో ఈ చెరువుకు సంబంధించి రూ.31 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. కానీ అవి బుట్టదాఖలయ్యాయి. ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. చెంబేడు చెరువు మినీ రిజర్వాయర్‌గా మారుతుందన్న రైతులు ఆశలు అడియాసలయ్యాయి.వర్షం పడితే సాగు చేయడం, లేకపోతే బీడుపొలాలుగా మిగిలిపోవడం రైతులకు పరిపాటిగా మారింది.

చంద్రగిరిని 'రెడ్ చందనగిరి'గా మార్చారు

నానీ అద్భుతమైన విజయాన్ని అందుకోవాలని కోరుతున్నా ● నరసాపురం ఎంపీ రఘురామకృష్ణమరాజు

తిరుపతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరిని కొందరు రెడ్ చందనగిరిగా మార్చారని నరసాపు రం ఎంపీ, టీడీపీ ఉండి ఎమ్మెల్యే అ భ్యర్థి రఘురామకృష్ణ మరాజు ఆవేదన వ్య క్తం చేశారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన ఆయన చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని కలిశారు. తర్వాత మీడియాతో మాట్లా డుతూ.. నానిని తొలిగా రైతు సదస్సులో కలిశానన్నారు. చాలా మంచి వ్యక్తని ప్రశంసించారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం బాధ్యతలు అప్పగించారంటే నాని గొప్పదనం అర్థం చేసుకోవచ్చన్నారు. కుప్పం ప్రజలు ఎలాంటి మెజార్టీతో బాబును గెలిపించుకుంటారో అదేస్థాయిలో నానీని కూడా గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. శ్రీవారి




ఎన్నికల్లో విజయం సాధించాలంటూ కంకణం కడుతున్న రఘురామకృష్ణమరాజు

ఆశీస్సులతో నాని అద్భుతమైన విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నానన్నారు. ఇక, కోస్తాలో ఉన్న విజయం రాయలసీమలోకి కూడా రావాలన్నారు. రాయలసీమలో ఒక మంచి వాడు, ఒక దుర్మార్గుడు పుట్టాడన్నారు. దుర్మార్గుడిని ఎన్నుకున్నామని ప్రజలందరికీ అర్థమైందని, వారు తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో ఉన్నారన్నారు. ఎన్నికల ఫలితాలు బాబుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. పదిరోజులుగా నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు విపరీతమైన కూటమి గాలి వీస్తోందన్నారు. చిత్తూరు జిల్లాల్లో కూడా మార్పు కనిపిస్తోందన్నారు. పైగా ఏ సర్వేలోనూ వైసీపీకి అధికారం వస్తున్నట్టుగా లేదన్నారు.

● గాసిప్

శిష్యవాత్సల్యం

పూర్వాశ్రమంలో కాంగ్రెస్ పార్టీలో ఒక్క వెలుగు వెలిగిన పెద్దాయన. కాలం కలిసి రాక వైసీపీలో చేరి, టీడీపీ మీదుగా తిరిగి సొంతగూటికే చేరారా మధ్య. పార్టీల మధ్య దూకే సమయాల్లో రాజకీయ సన్యాసం గురించి కూడా ఆలోచించారేమో.. చాలా గ్యాప్ తీసేసుకున్నారు. ఈయనతోనే ఉన్న ప్రియశిష్యుడు ప్రస్తుతమున్న పార్టీని వీడి, పూర్వ కాంగ్రెస్‌లోకి జంప్ చేసి.. కుప్పం అభ్యర్థి అయిపోయారు. ఈ క్రమంలో ఇటీవల తమ పార్టీ ప్రచార యాత్ర ప్రారంభించిన ఈ పెద్దాయన శాంతిపురం మండలంలోని రెండు గ్రామాలకు వెళ్లారు. ఆ గ్రామాలలో ఆయన శిష్యుడి సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువ. పూర్వాశ్రమంలో అతడు



తనకిచ్చిన గట్టి మద్దతు, అప్పట్లో జిల్లా స్థాయి పదవి పొందడంలో కూడగట్టిన పార్టీ శ్రేణుల సహకారం.. ఆయన కళ్ల ముందు కదిలిందేమో? శిష్య వాత్సల్యం ముంచుకొచ్చింది. తాను ప్రస్తుతమున్న పార్టీని, ఆ పార్టీ ప్రచారాన్ని మరచిపోయారాయన. తన శిష్యుడికి ఓట్లేయాల్సిందిగా ఆ సామాజికవర్గం వారిని కోరివచ్చారట. కేవలం తన శిష్యుడైనంత మాత్రానికే, డిపాజిట్టు కూడా దక్కుతుందో లేదో తెలియని పార్టీ అభ్యర్థికి ఓట్లేయమని అడిగి వచ్చిన పెద్దాయన శిష్యవాత్సల్యం ఇప్పుడు శాంతిపురం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుత పార్టీ పెద్దలకు ఈ విషయం తెలిస్తే రాజకీయ మనుగడకు ప్రమాదమని తెలిసినా గురువుగా ఆయన చూపించిన తెగువకు శిష్యగణం కళ్లు చెమరుస్తున్నాయి. 'అదీ.. గురువంటే అలా ఉండాలి' అంటూ వాళ్లు ఆనందబాష్పాలను కారుస్తున్నారట. - కుప్పం

జన కేతనం

www.andhrajyothy.com
బుధవారం 24 ఏప్రిల్ 2024

చెడిపోయిన రాజకీయ వ్యవస్థలోకి విశ్వసనీయత, నిజాయతీ అనే పదాలు రావాలి. ఏ రాజకీయ నాయకుడైనా ఒక పని చేస్తానని చెప్పి చేయకపోతే.. తన పదవికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి తేవాలి. మోసం చేసేవాడు.. అబద్ధాలు చెప్పేవాడు.. మీకు నాయకుడిగా కావాలా..? ఆలోచించుకోండి.

- ఆరేళ్ల కిందట జిల్లాలో పాదయాత్ర చేస్తూ జగన్ చెప్పిన మాటలు ఇవి.

ప్రతిపక్ష నేతగా.. అధికారంలోకి రాగానే చిత్తూరు డెయిరీని పునరుద్ధరిస్తాం. ఆ డెయిరీకి పాలు పోసే రైతులకు లీటరుకు రూ.4 చొప్పున రాయితీ ఇస్తామని చెబుతున్నా. జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించి చెరకు రైతుల కష్టాలు తీరుస్తా.

- 2018 జనవరిలో పాదయాత్ర సందర్భంగా జగన్ చెప్పిన మాటలివి.



ఇదేనా విశ్వసనీయత జగన్?

● విపక్ష నేతగా విలువలు, చెప్పింది చేయడంపై పెద్దపెద్ద మాటలు చెప్పారు
● సీఎంగా నెరవేర్చారా



● విజయా డెయిరీ

ముఖ్యమంత్రిగా.. చిత్తూరు విజయా డెయిరీని అమూల్‌కు అప్పనంగా కట్టబెట్టేసి, ఇదే పునరుద్ధరణ అంటే ఎలా? ఇక, చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణ ఊసేలేదు. విపక్ష నేతగా ఇచ్చిన మాటను.. సీఎంగా నిలబెట్టుకోలేదు. నాడు మీరు వల్లించిన విశ్వసనీయత అంటే ఇదేనా?

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు

'అమూల్'కు కట్టబెట్టేసి పునరుద్ధరణ అంటే ఎలా?

అధికారంలోకి రాగానే చిత్తూరు విజయా డెయిరీని పునరుద్ధరిస్తానని మాట ఇచ్చి.. అమూల్‌కు అప్పనంగా కట్టబెట్టేశారు. దీనినే పునరుద్ధరణ అంటూ సీఎం జగన్ గొప్పగా చెప్పడంపై జిల్లా పాడి రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఈ డెయిరీకి చెందిన 27 ఎకరాల భూములు, ఇతర ప్రాంతాల్లోని ఆస్తుల విలువ సుమారు రూ.500 కోట్లు. ఇంత ఆస్తిని ఏడాదికి కేవలం రూ.కోటి చొప్పున ఏకంగా 99 ఏళ్ల లీజుకు అమూల్ సంస్థకు అప్పగించేశారు. ఇదే అమూల్ మాకొద్దని కర్ణాటక, తమిళనాడు సీఎంలు తెగేసి చెప్పారు. సీఎం జగన్ మాత్రం దాన్ని చంకనెత్తుకున్నారు. పైగా పాడి రైతులకు చేస్తున్న గొప్ప కార్యక్రమంగా చెప్పుకుంటున్నారు.

డెయిరీ ఉద్యోగులను పట్టించుకోని పాలకులు

అమూల్‌కు అప్పనంగా డెయిరీ ఇచ్చేసిన సీఎం జగన్ ఆ సంస్థ ఉద్యోగులను పట్టించుకోలేదు. జీతాలు రాలేదని డెయిరీ కార్మికులు(టైమ్ స్కేల్ ఉద్యోగులు) 221 రోజులుగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తూనే ఉన్నారు. 140 మందికి రూ.63 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నా పట్టించుకునే వాళ్లే కరువయ్యారు.విజయా డెయిరీని 'అమూల్'కు కట్టబెట్టేందుకు చూపిన ఉత్సాహం..ఉద్యోగుల జీతాలపై చూపకపోవడం మానవీయమేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



తీపి మాటలు.. చేదు చేతలు

చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణ హామీ గాలికే

చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తానని హామీనిచ్చిన జగన్.. ఈ ఐదేళ్లలో పట్టించుకోలేదు. గతేడాది ఈ రెండు ఫ్యాక్టరీల ఆస్తులు, అప్పులు తేల్చడానికి లిక్విడేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఉద్యోగుల కుటుంబాలకు మాత్రం బకాయిలను చెల్లించారు. ఈ రెండు ఫ్యాక్టరీలు ఉన్నప్పుడు జిల్లాలో రైతులు 54 వేల హెక్టార్లలో చెరకును సాగు చేసేవారు. ఇప్పుడు సాగు సగానికి సగం తగ్గింది.

చిత్తూరు ఫ్యాక్టరీ పరిస్థితి

చిత్తూరు కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ 1964లో ప్రారంభమైంది. 2003-04 వరకు 16 వేల మంది రైతులతో ఓ వెలుగు వెలిగింది. తరువాత క్రమంగా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 2014-15లో క్రషింగ్ చేయకుండా ఆపేసింది. క్రమంగా మూతపడింది. మూతపడే సమయానికి రైతులకు బకాయిపడిన రూ.13 కోట్లను టీడీపీ ప్రభుత్వం చెల్లించేసింది. దీనిని తెరిపిస్తానని జగన్ హామీ ఇస్తే చెరకు రైతులు, సంస్థ ఉద్యోగులు సంబరపడ్డారు. ఈ అయిదేళ్లూ హామీ అమలుకు సీఎం కనీస ప్రయత్నం కూడా చెయ్యకపోవడంతో మోసపోయామని రైతులు, సంస్థ ఉద్యోగులు గుర్తించారు.

ప్రైవేటు ఫ్యాక్టరీలతో రైతులకు తీవ్ర నష్టం

జిల్లాలోని ప్రైవేటు చక్కెర ఫ్యాక్టరీల యాజమాన్యం ఇష్టానుసారం పర్మిట్లు ఇవ్వడంతో ఓ రకంగా, బిల్లులు సకాలంలో అందించకపోవడంతో మరో రకంగా రైతులు నష్టపోతున్నారు. ఈ ప్రైవేటు ఫ్యాక్టరీలు కుమ్మక్కై మద్దతు ధర విషయంలో రైతులకు అన్యాయం చేసిన సందర్భాలున్నాయి. నేతమ్స్, మయూర చక్కెర కర్మాగారాలు మూడేళ్లుగా రూ.కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో, రైతులు అప్పులపాలయ్యారు. మరికొందరు అప్పులు చెల్లించలేక భూములను అమ్ముకున్నారు.

సహకార ఫ్యాక్టరీతో లాభాలు

సహకార ఫ్యాక్టరీల్లో సీనియారిటీ ప్రకారం రైతులకు పర్మిట్లు అందేవి. రైతు కూడా భాగస్వామి కావడంతో లాభాల్లో వాటా వస్తుంది. సహకార సిబ్బంది రైతుల పొలాల వద్దకు వచ్చి చెరకు పంటలో చక్కెర శాతాన్ని పరీక్షించి పర్మిట్లు మంజూరు చేసేవారు. ప్రస్తుతం ప్రైవేటు యాజమాన్యం ఇలా చేయకుండా, వెనుక పంట ముందుగా, ముందేసిన పంట ఆలస్యంగా క్రషింగుకు తీసుకుంటున్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూసినా బిల్లుల ంరావడం లేదు. సహకార ఫ్యాక్టరీలు మూత పడడంతో ఇలా అన్ని విధాలుగా రైతులు నష్టపోతున్నారు.

డెయిరీ మూతకు కారణమేంటి?

తన హెరిటేజ్ కోసం నాడు చిత్తూరు డెయిరీని చంద్రబాబు మూసివేయించారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. కానీ.. మూతపడటానికి కారణాలను పరిశీలిస్తే.. రాష్ట్రంలో 1990-2000 మధ్య అనేక సహకార డెయిరీలు మూత పడ్డాయి. దీనికి ప్రధాన కారణం 1992లో కేంద్రం మిల్క్ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్ (ఎంఅండ్‌పీవో) జారీ చేసి, ప్రైవేటు డెయిరీలకు అవకాశం కల్పించింది. అప్పటికే ఆపరేషన్ ఫ్లడ్3 ద్వారా యూరప్ నుంచి వచ్చిన పాలపొడిని ఉచితంగా సరఫరా చేసింది. దీంతో పాల ధర తగ్గి, డెయిరీలు నష్టాల బారిన పడ్డాయి. చిత్తూరు డెయిరీ పాలను ఏడాదిలో ఏడు నెలలే ఏపీ డెయిరీ ఫెడరేషన్ కొనేది. మిగతా రోజుల్లో ఆవు పాల వంకతో కొనేది కాదు. ఏడాదంతా కాంట్రాక్టు ఇచ్చేది కాదు. పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేసుకోవడానికి రాష్ట్ర యూనియన్ అనుమతి ఇచ్చేది కాదు. చిత్తూరు డెయిరీ రోజుకు 2.75 లక్షల లీటర్లు సేకరిస్తే 1.60 లక్షల లీటర్లే కొన్న పరిస్థితి. అప్పట్లో డెయిరీకి తిరుపతి మినహా ఇతర పట్టణాల్లో పెద్దగా మార్కెట్ లేదు. టీటీడీ కిలో నెయ్యి రూ.45 చొప్పున టెండర్లు ఇచ్చేది. కానీ కిలో నెయ్యి వ్యయం రూ.54 దాకా ఉండేది. ఈ కారణాలతో సంస్థకు 1991 నాటికే రూ.కోట్లలో నష్టం వచ్చింది. 1993లో హెరిటేజ్ పెట్టే నాటికి చిత్తూరు డెయిరీ నష్టాల్లో కూరుకుపోయింది. 1992లో ఎంపీవో (డీ లైసెన్సింగ్) ద్వారా కేంద్రం ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించింది. ఫలితంగా చిత్తూరు జిల్లాలోనే 32 మిల్క్ చిల్లింగ్ సెంటర్లు నెలకొల్పారు. ప్రస్తుతం జిల్లాలో 10 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. 30 ప్రైవేటు డెయిరీలున్నాయి.

పాడి రైతులకు అన్యాయం



కోట్లాది రూపాయలు విలువచేసే విజయా డెయిరీని ప్రైవేటు సంస్థకు ఇస్తే తిరిగి రాదని అప్పుడే చెప్పాను. అమూల్ సంస్థకు 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఒంటరి పోరాటాలు చేశాను. మంత్రులను సభల్లో ప్రశ్నించాను. సీఎం జగన్ చిత్తూరుకు వచ్చినప్పుడు నిరసన తెలుపుతానని తెలిసి పోలీసులు నన్ను హౌస్ అరెస్టు చేశారు. అమూల్ సంస్థకు డెయిరీని అప్పగించడం పాడి రైతులకు అన్యాయం చేయడమే.

- ఈదల వెంకటాచలం నాయుడు, ఉద్యమకారుడు, జిల్లా పాడి రైతుల సంఘం

ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం సరికాదు



విజయా డెయిరీని అమూల్ ప్రైవేటు సంస్థకు అప్పగించడం సరికాదు. దీని వల్ల రైతులకు బాగా నష్టం కలుగుతుంది. డెయిరీని కోఆపరేటివ్ సొసైటీకి అప్పగించి ఉంటే రైతులకు కొంత ప్రయోజనం ఉండేది. ప్రభుత్వ యాజమాన్యంలో గిట్టుబాటు ధర ఉండేది. ఇప్పుడు ప్రైవేటు సంస్థ నిర్ణయించినదే పాల ధర. దీని ద్వారా రైతులకు నష్టం తప్ప, లాభం ఉండదు.

- ఎ.రాధిక, పాడి రైతు, చిత్తూరు రూరల్

మా బతుకులు రోడ్డున పడ్డాయి



డెయిరీలోని 140 మంది వర్కర్లకు రూ.63 కోట్లు బకాయిలు ఇంత వరకు రాలేదు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మా బతుకులు రోడ్డున పడుతున్నాయి. 220 రోజులకు పైగా డెయిరీ ముందు దీక్ష చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ ఆస్తిని అతి తక్కువ ధరకు విజయా డెయిరీని ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించింది.

- పీడీ కుమార్, టైంస్కేల్ వర్కర్, విజయా డెయిరీ

కుప్పం వర్తమానం

ఒకరు మాజీ సర్పంచి. మరొకరు ప్రస్తుత సర్పంచి భార్య. ఇద్దరికీ అధికార పార్టీలో అవమానాలే ఎదురయ్యాయి. చేసిన కష్టానికి తగిన గుర్తింపు దక్కలేదని ఒకరు, సొంత పార్టీ నాయకుల భూ కబ్జాలు, దందాలు భరించలేక మరొకరు.. రెబల్ అభ్యర్థులుగా నిలిచారు. ఒకరు వైసీపీ అభ్యర్థిగానే నామినేషన్ వేస్తే మరొకరు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి వైసీపీ ప్రకటిత అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్‌ను సవాల్ చేస్తున్నారు. - కుప్పం

వైసీపీకి రెబల్స్ దెబ్బ!

● ఎదురు తిరిగిన ఆ ఇద్దరూ





ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నీలావతి - వసనాడు మురళి

ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అంతకంతకూ పుంజుకుంటోంది. గ్రామగ్రామానా ఆ పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోంది. పార్టీ తలపెడుతున్న ప్రచారాలు, కార్యక్రమాలకు జనం వెల్లువెత్తుతున్నారు. ఈనెల 19న చంద్రబాబు తరఫున నామినేషన్ వేసిన ఆయన సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్న ర్యాలీకి స్వచ్ఛందంగా తరలి వచ్చిన వేలాదిమంది జనమే దీనికి నిదర్శనం. దీనికి రివర్స్‌లో వైసీపీ పరిస్థితి నియోజకవర్గంలో నానాటికీ దిగజారుతోంది. ఎక్కడికక్కడ పార్టీ, విభేదాలతో కునారిల్లుతోంది. గోరుచుట్టుమీద రోకలిపోటులా ఇప్పుడు ఆ పార్టీ ప్రకటిత అభ్యర్థి భరత్‌కు ఇద్దరు రెబల్ అభ్యర్థులు తయారయ్యారు. కుప్పం మండలం వసనాడు వైసీపీ మాజీ సర్పంచి బి.మురళీధర్ అలియాస్ వసనాడు మురళి సోమవారం ఆ పార్టీ అభ్యర్థిగానే పేర్కొంటూ నామినేషన్ వేస్తే, శాంతిపురం మండలం మొరసనపల్లె వైసీపీ సర్పంచి అభ్యర్థి జగదీశ్ భార్య నీలమ్మ అలియాస్ నీలావతి మంగళవారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఇద్దరూ ఎటువంటి హంగామా, అట్టహాసం లేకుండా ఒకరిద్దరు మనుషులతో వచ్చి నామినేషన్ వేసేసి వెళ్లారు.

పార్టీ నాయకుల తీరుపై తీవ్ర నిరసన

ఐదేళ్ల వైసీపీ పాలనలో కుప్పం నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధికీ నోచులేకపోయింది. కుప్పం పట్టణంలో అక్కడక్కడా సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించడం తప్ప పంచాయతీల్లో అభివృద్ధి అనేదే కనిపించకపోవడంపై ప్రజల్లో ఔఅసంతృప్తి ఉంది. ఇక, వైసీపీ నాయకుల ఇసుక.. భూదందాలు, క్వారీ అక్రమాలు ప్రజలను చీకాకుపెట్టాయి. దాడులు, దౌర్జన్యాలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించాయి. ఇప్పుడు ఇవే మాటలు వైసీపీ రెబల్ అభ్యర్థులు కూడా చెబుతున్నారు. పార్టీకోసం దీర్ఘకాలంగా కష్టపడినా గుర్తింపు లభించకపోగా, పైస్థాయిలోనే అక్రమాలు, దౌర్జన్యాలు తమను బాధించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తమ పంచాయతీలకు, అక్కడి ప్రజలకు ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేకపోయామంటున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రస్తుత అభ్యర్థి అయిన భరత్‌పైనే వారు విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. నామినేషన్‌వేసి వచ్చాక వైసీపీ నేతల దందాలు, భూ కబ్జాలపై నీలావతి గళం విప్పారు. వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు అమాయక ప్రజలు బలైపోతున్నారని ధ్వజమెత్తారు. వారి ఆగడాల నుంచి రక్షణ కావాలంటే తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

అంతర్గత విభేదాలూ ఎక్కువే


పేరుకు నామినేషన్ వేసిన రెబల్ అభ్యర్థులు ఇద్దరే అయినా, పార్టీలో అంతర్గతంగా ఉన్న నిరసనలు, విభేదాలు చాలా ఎక్కువే. పార్టీ నాయకుల దౌర్జన్యాలను సహించలేక, వారి నిరాదరణకు గురైన పలువురు కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు ఈ ఇద్దరు రెబల్స్ ధైర్యాన్ని మెచ్చుకుంటున్నారు. రాబోయే రోజుల్లో వైసీపీలో మరింత నిరసన సెగ తగలక తప్పదని అటువంటివారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

- కుప్పం

● నోట్ దిస్ పాయింట్

అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం
పలమనేరు..
2,66,935 మంది ఓటర్లు
అత్యల్పం: చిత్తూరు..
2,00,822 మంది

పోలింగ్ కేంద్రాలు: 1771
పలమనేరు: 288 (అత్యధికం)
చిత్తూరు: 226 (అత్యల్పం)
సమస్యాత్మకం
పుంగనూరు: 100 (అత్యధికం)
గంగాధరనెల్లూరు: 34 (అత్యల్పం)



- చిత్తూరు కలెక్టరేట్

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఆ కీచక టీచరు మాకు వద్దే వద్దు



ధర్నా చేస్తున్న విద్యార్థులు, మదనంబేడు గ్రామస్తులు

సత్యవేడు, ఏప్రిల్ 23: సత్యవేడు మండలం మదనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఫిజికల్ సైన్స్ టీచరు మాకొద్దంటూ మంగళవారం స్కూలు ప్రాంగణంలో విద్యార్థులతో పాటు గ్రామస్తులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సురేష్, ఆనందయ్య మాట్లాడుతూ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న శ్యాముల్ జాన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపించారు. గతంలో పాఠశాలలో ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బయట పడడంతో డీఈవో దృష్టి తీసుకెళ్ళగా గత ఏడాది సెప్టెంబర్‌లో శ్యాముల్‌జాన్‌ను సస్పెండ్ చేశారు. తిరిగి 2024 జనవరిలో సస్పెన్స్ రద్దుచేసి ఇక్కడ మళ్లీ పోస్టింగ్ ఇస్తూ డిప్యూటేషన్‌పై సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలకు పంపడం జరిగిందన్నారు. డిప్యూటేషన్ ఉత్తర్వులు రద్దు కావడంతో మంగళవారం మదనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు రావడంతో గ్రామస్తులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో హెచ్‌ఎం చినబాబు పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. టీచరు శ్యాముల్ జాన్ మాకొద్దంటూ గ్రామస్తులు హెచ్‌ఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాము, రవి, సుధాకర్, రాజేష్, మోహన్, పరంధామం, విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు అంకురార్పణ



గరికల ఊరేగింపు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23: శ్రీకాళహస్తి పట్టణంలో వెలసిన ముత్యాలమ్మ జాతర మంగళవారం నుంచి ప్రారంభమైంది. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక మూడు రోజులపాటు జాతర నిర్వహించనున్నారు. మంగళవారం సంప్రదాయపద్ధంగా జాతర వేడుకను ప్రారంభించారు. ముక్కంటి ఆలయం నుంచి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయం నుంచి తొలిరోజు పోతురాజు గరికలను పట్టణంలో ఊరేగించారు. ఆలయంలో మూలమూర్తి ఎదురుగా వేసిన మైల ముగ్గు, గరికల ఊరేగింపును భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిస్టిలరీల్లో అవకతవకలు జరిగితే చర్యలు: ఎస్పీ



డిస్టిలరీని తనిఖీ చేస్తున్న ఎస్పీ

రేణిగుంట, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డిస్టిలరీల్లో ఏదైనా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ హెచ్చరించారు. రేణిగుంట మండలం కరకంబాడి వద్ద ఉన్న ఈశ్వర్ డిస్టిలరీని మంగళవారం తనిఖీ చేశారు. స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెబ్, పోలీసు అధికారులు తరచూ తనిఖీలు చేయాలని చెప్పారు. అదనపు ఎస్పీ రాజేంద్ర, రేణిగుంట డీఎస్పీ భవ్యశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐటీలో ప్రపంచ పుస్తక దినోత్సవం

ఏర్పేడు, ఏప్రిల్ 23: ఏర్పేడు సమీపంలోని ఐఐటీలో మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ప్రొఫెసర్ రఘురామరాజు(చైర్మన్, లైబ్రరీ), డాక్టర్ అరుణ్ కే మన్నా(కన్వీనర్, లైబ్రరీ అడ్వైజరీ కమిటీ) సమక్షంలో ఐఐటీ తిరుపతిలోని అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్ డీన్, యాక్టింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎస్‌ఎంఎస్ రాఘవరావు పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. డిప్యూటీ లైబ్రేరియన్ ప్రశాంత కుమార్ బెహరా, షమీర్ ప్రమోద్‌కుమార్, మహదేవ్ షాహాజీ మోహితే, అల్కా, శశికుమార్, హరిసాయిప్రియ, షిన్నా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

తొట్టంబేడు, ఏప్రిల్ 23: అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని మాజీ ఎంపీపీ తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని అమ్మచెరువు గ్రామంలో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, క్లస్టర్ ఇంచార్జి రంగినేని చెంచయ్యనాయుడు, తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, బొల్లినేని జగన్నాథం నాయుడు. బత్తిరెడ్డి, మాజీ సర్పంచు ఈశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాక్షసపాలనకు చరమగీతం పాడండి

తొట్టంబేడు, ఏప్రిల్ 23: రాక్షసపాలనకు చరమగీతం పాడాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత అన్నారు. మండలంలోని పోయ్య, పోయ్య కొత్తూరు, చిన్నసింగమాల గ్రామాలలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఎన్డీఏ కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. జనసేన మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో 'విశ్వం' వందశాతం ఉత్తీర్ణత

తిరుపతి(విద్య), ఏప్రిల్ 23: తిరుపతి వరదరాజనగర్, జీవకోనలోని విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి, ప్రతిభ చాటారని చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. గణితం సబ్జెక్టులో రెడ్డి చరణ్‌రెడ్డి, యశ్వంత్, అఖిలేష్, మధుప్రియ, చైతన్య, కోమల్‌కుమార్, శశాంక్‌రెడ్డి, శివకృష్ణలు వందకి వంద మార్కులు సాధించి సత్తా చాటారని తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ విశ్వతులసి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ అభినందించారు.



విద్యార్థులతో విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి తదితరులు

వైభవంగా చైత్ర పూర్ణిమ

శ్రీకాళహస్తి, ఎప్రిల్ 23: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చైత్ర పూర్ణిమ విశేష తిథిని పురస్కరించుకుని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలోని ధ్వజస్థంభం వద్ద ప్రదోష నంది వాహనంపై స్వామి వారిని కొలువుదీర్చారు. శాస్త్రోక్తంగా సద్యోముక్తి వ్రతం ఆరంభించి హారతులు ప్రత్యేక హారతులు సమర్పించారు. అనంతరం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అర్చకులు ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులు చతుర్మాడా వీధుల్లో నగరోత్సవంగా ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్ల నగరోత్సవం

నియంత పాలన అంతం: సుధీర్ రెడ్డి



23వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి నేతలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23: శ్రీకాళహస్తిలో నియంత పాలనకు అంతం సమీపించిందని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. మంగళవారం వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ అబీదా, ఆమె భర్త నజీర్, మాజీ కౌన్సిలర్ మహబూబ్ బాషా తమ అనుచరులతో కలిసి సుధీర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారిందరికీ బొజ్జల బృందమ్మ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన ఈ ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని 26వ వార్డులో బొజల సుధీర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక సమస్యలను నమోదు చేసుకుని ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... రాక్షస పాలన వల్ల అభివృద్ధిలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని రామసేతు వంతెన పక్కన శివం టు శివం రోడ్డు నిర్మాణం చేశామని ఎమ్మెల్యే మధు పదేపదే అసత్యాలు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఆయన చెప్పిన ప్రదేశంలో రోడ్డు ఎక్కడ ఉందో చూపాలని ప్రశ్నించారు. ఇలాంటి బోగస్ ప్రచారాలను ప్రజలంతా గమనిస్తున్నారని.... వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సాయంత్రం కూటమి నేతలు సమష్టిగా 23, 25వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డిని, కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. మధ్యాహ్నం పట్టణంలో బీసీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల పక్షపాతిగా ఉంటూ ఎన్నో సంక్షేమ పథకాలను చేరువచేసిందన్నారు. బీసీని మున్సిపల్ చైర్మన్ చేసిన ఘనత బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి మాత్రమే దక్కిందన్నారు. ఉమ్మడి ప్రభుత్వంలో బీసీలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలూరు శ్రీనివాసరెడ్డి, ఉమేష్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



శివం టు శివం రోడ్డు ఎక్కడో ఉందో చూపాలంటూ సుధీర్ రెడ్డి

దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలన్నదే ఎన్డీఏ లక్ష్యం

తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు

తిరుపతి,(ఉపాధ్యాయనగర్/శ్రీకాళహస్తి) ఏప్రిల్ 23: అవినీతి నిర్మూలన, దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలన్నదే ఎన్డీఏ కూటమి లక్ష్యమని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. మంగళవారం తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ అవినీతి లేని సమాజం కోసం ఎన్డీఏ పనిచేస్తుందన్నారు. అందుకే ప్రజలు ఎన్డీఏ కూటమికి విజయాన్ని అందించబోతున్నారన్నారు. తాను ఎంపీగా ఐదేళ్ల ఇక్కడ పని చేశానని, ఆ సమయంలో తాను చేసిన అభివృద్ధి పనులు తప్ప ప్రస్తుతం ఏటువంటి అభివృద్ధి ఈ ప్రభుత్వంలో జరగలేదని స్థానికులు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. అభివృద్ధి ఎలా ఉంటుందో తాను గెలిచిన తరువాత చేసి చూపిస్తానంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఆయన సతీమణి కొల్లూరి లక్ష్మి మిట్టవీధిలో గడపగడపకు తిరుగుతూ బీజేపీ, జనసేన అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.



సమావేశంలో ప్రజలతో అభివాదం చేస్తున్న వరప్రసాదరావు



ఓటు వేయమని అభ్యర్థిస్తున్న వరప్రసాదరావు సతీమణి కొల్లూరి లక్ష్మి

బీసీలకు అండగా ఎన్డీఏ కూటమి

బీసీలకు అండగా ఉండేది ఎన్డీఏ కూటమి అని వరప్రసాదరావు అన్నారు. శ్రీకాళహస్తి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో జయహో బీసీ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వరప్రసాదరావు ఎమ్మెల్యే అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌ను, ఎంపీ అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ల సమర్పణ

శ్రీకాళహస్తి/సత్యవేడు, ఏప్రిల్ 23: శ్రీకాళహస్తి, సత్యవేడు అసెంబ్లీ స్థానాలకు మంగళవారం మూడు చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ రాజేష్ నాయుడు, సత్యవేడులో వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్, కాంగ్రెస్ లిబరేషన్ పార్టీ అభ్యర్థిగా విజయ్‌కుమార్ నామినేషన్ వేశారు.

సుస్థిర పర్యావరణ సామాజిక నిర్వహణ పద్ధతులపై సదస్సు

శ్రీసిటీ, ఏప్రిల్ 23: మద్రాస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్(ఎంసీసీఐ), శ్రీసిటీ సంయుక్తంగా మంగళవారం స్థానిక బిజినెస్ సెంటర్‌లో ఈఎస్‌జీ సర్క్యులర్ ఎకానమీ, డీ కార్బనైజేషన్ అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రారంభోపన్యాసంలో సదస్సు ప్రాముఖ్యత ఆవశ్యకతను వివరించారు. ప్రస్తుత కీలక తరుణంలో సుస్థిరత, వినూత్న ఆవిష్కరణలు, జవాబుదారీతనం ప్రధాన సవాళ్లుగా మారాయన్నారు. ఎన్వీ రాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సెంటర్ అధికారి శివరంజని సుబ్రమణియన్‌తో సహా పలువురు వక్తలు వారి ప్రసంగంలో ఈఎస్‌జీ సూత్రాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎన్వీ రాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సెంటర్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఆశా పన్వార్ మాట్లాడుతూ సుస్థిరతను పెంపొందించడంలో సర్క్యులర్ ఎకానమీ ప్రాముఖ్యతను వివరించారు. ఎన్వీ రాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సెంటర్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జె.మెహతా కర్బన రాహిత్య సూత్రాలతో నికర సున్నా ఉద్గారాల లక్ష్యాన్ని సాధించడానికి పలు సూచనలు చేశారు. ఎంసీసీఐ సెక్రటరీ జనరల్ సరస్వతి మాట్లాడుతూ ఎంసీసీఐ పరిణామక్రమం, సుస్థిరత, బాధ్యతాయుతమైన వ్యాపార పద్ధతులను ప్రోత్సహించడంలో సంస్థ సహకార చర్యలను వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు, పరిశ్రమ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సులో శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్, శ్రీసిటీ పర్యావరణ విభాగ అధికారి డా. వెంకట్ కూడా పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సరస్వతి, శివరంజని

ఫేక్ లింక్ ఓపెన్ చేయడంతో

రూ.3.88లక్షలు కొట్టేశారు

రూ.3.58లక్షలు రికవరీ చేసిన సైబర్ క్రైం పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23: ఓ వ్యక్తి తన మొబైల్‌కి వచ్చిన ఫేక్ లింక్‌ను ఓపెన్ చేయడంతో రూ.3.88లక్షలను సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించడంతో రూ.3.58లక్షలను రికవరీ చేశారు. మంగళవారం సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ మీడియాకు తెలిపారు. రేణిగుంటకు చెందిన గురుశేఖర్ మొబైల్‌కి ఓ లింక్ వచ్చింది. అది ఫేక్‌లింక్ అని తెలియక బాధితుడు ఓపెన్ చేసిన కొద్ది సేపటికే తన ఐసీఐసీఐ బ్యాంకు క్రెడిట్ కార్డు నుంచి ఎనిమిది లావాదేవీల ద్వారా రూ.3.88 లక్షలు సైబర్ క్రైం నేరగాళ్లు డెబిట్ చేసేశారు. గంట తర్వాత విషయం తెలుసుకున్న బాధితుడు తిరుపతిలోని సైబర్ క్రైం పోలీసులను సోమవారం సాయంత్రం ఆశ్రయించాడు. సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బంది రంగంలోకి దిగి.. బాధితుడి క్రెడిట్ కార్డు ద్వారా ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లో మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. వెంటనే ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. అలాగే సంబంధిత వెబ్‌సైట్ నోడల్ అధికారికి విషయం తెలియజేసి, సైబర్ నేరగాళ్లు బుక్ చేసిన మొత్తం ఆర్డర్లు రద్దు చేయించి, రూ.3.58 లక్షలు రీఫండ్ అయ్యేలా చేశారు. మిగిలిన రూ.30,000 దర్యాప్తులో రికవరీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు. సైబర్ మోసాలపై బాధితులు 24 గంటల్లోగా 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

అరాచక పాలన అంతమైతేనే

సమస్యలకు పరిష్కారం: ఆదిమూలం



కీళపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న ఆదిమూలం

పిచ్చాటూరు, ఏప్రిల్ 23: రాష్ట్రంలో అరాచక పాలన అంతమైతేనే సమస్యలకు మోక్షం లభిస్తుందని ఎన్డీఏ కూటమి సత్యవేడు అభ్యర్థి కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కీళపూడి ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ మధుబాల పద్మనాభరాజు ఇంటి నుంచి ప్రచారాన్ని ప్రారంభించి ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ప్రచార రథంపై గజసింగరాజపురం, అక్కగారిపేట, నీరువాయి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గడిచిన ఐదేళ్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సత్యవేడు మీదపడి సహజ వనరులను దోచుకున్నారని, మళ్లీ పెత్తనం చెలాయించడం కోసం తన బంట్రోతును ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలరెడ్డి, ఇళంగోవన్‌రెడ్డి, సతీష్‌నాయుడు, పద్మనాగరాజు, మధుబాల, లక్ష్మణరాజు, పద్దురాజు, జయచంద్ర నాయుడు, రవి, బుజ్జినాయుడు, రవినాయుడు, రామకృష్ణమరాజు, దుష్యంతరాజు తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ మధుబాల పద్మనాభరాజు స్వగృహం ఆవరణలో జయహో బీసీ సదస్సు జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



నారాయణవనం, ఏప్రిల్ 23: మండలంలోని సముదాయం గ్రామంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో ముగిశాయి. ఉదయం మండల పరిధిలోని కైలాసనాథకోనలో త్రిశూల స్నానం నిర్వహించారు. తిరుచ్చి వాహనంపై మరగదవల్లీ, అగస్త్యేశ్వరస్వామి ఉత్సవర్లు, త్రిశూలాన్ని ఊరేగింపుగా వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కైలాసకోనకు వేంచేశారు. అక్కడ తిరుమంజనం అనంతరం కోన జలపాతంలో త్రిశూలానికి స్నానం చేయించారు. సాయంత్రం ఆలయంలో ధ్వజస్తంభం నుంచి నందీశ్వరుడి చిత్రపట వస్త్రాన్ని అర్చకులు అవరోహణం చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

పుత్తూరు వార్తలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 23: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన పుత్తూరులో జరిగింది. నారాయణవనం మండల పరిధిలోని కొండలచెరువుకు చెందిన మాజీ ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం రెడ్డి(73) మంగళవారం రాచపాళెంకు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పుత్తూరు బైపాస్‌లోని తొరూరు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. గాయపడిన సుబ్రహ్మణ్యంరెడ్డికి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భానుప్రకాష్ తరపున నామినేషన్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 23: నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు మద్దతుగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, అడ్వకేట్ శేషాచలం పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

వడమాలపేట, ఏప్రిల్ 23: వడమాలపేట మండలానికి చెందిన పలువురు వైసీపీ నేతలు మంగళవారం టీడీపీలో చేరారు. తిరుమణ్యం మాజీ ఎంపీటీసీ లలితమ్మ, అప్పలాయగుంటకు చెందిన వైసీపీ మునీంద్ర ఆధ్వర్యంలో సుమారు వంద కుటుంబాల వారు టీడీపీలో చేరారు. అలాగే వేమాపురానికి చెందిన వైసీపీ నేత సోమశేఖర్ ఆధ్వర్యంలో 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అదేవిధంగా తిరుమణ్యం గ్రామానికి చెందిన దీపురెడ్డి, వెంకటరెడ్డి, కార్తీక్, యుగంధర్, ప్రకాష్, భూపతి, సోము, మధు, పురందర్, మణికంఠ, దేశయ్య, దేవరాజులు, వెంకటపతి, సురేష్, రవి తదితరులు టీడీపీలో చేరారు. వీరందరికీ నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



లలితమ్మకు టీడీపీ కండువా కప్పుతున్న భానుప్రకాష్

చంద్రగిరిని 'రెడ్ చందనగిరి'గా మార్చారు

నానీ అద్భుతమైన విజయాన్ని అందుకోవాలని కోరుతున్నా ● నరసాపురం ఎంపీ రఘురామకృష్ణమరాజు

తిరుపతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరిని కొందరు రెడ్ చందనగిరిగా మార్చారని నరసాపు రం ఎంపీ, టీడీపీ ఉండి ఎమ్మెల్యే అ భ్యర్థి రఘురామకృష్ణ మరాజు ఆవేదన వ్య క్తం చేశారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన ఆయన చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని కలిశారు. తర్వాత మీడియాతో మాట్లా డుతూ.. నానిని తొలిగా రైతు సదస్సులో కలిశానన్నారు. చాలా మంచి వ్యక్తని ప్రశంసించారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం బాధ్యతలు అప్పగించారంటే నాని గొప్పదనం అర్థం చేసుకోవచ్చన్నారు. కుప్పం ప్రజలు ఎలాంటి మెజార్టీతో బాబును గెలిపించుకుం టారో అదేస్థాయిలో నానీని కూడా గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. శ్రీవారి




ఎన్నికల్లో విజయం సాధించాలంటూ కంకణం కడుతున్న రఘురామకృష్ణమరాజు

ఆశీస్సులతో నాని అద్భుతమైన విజయాన్ని సాధిం చాలని కోరుకుంటున్నానన్నారు. ఇక, కోస్తాలో ఉన్న విజయం రాయలసీమలోకి కూడా రావాలన్నారు. రాయలసీమలో ఒక మంచి వాడు, ఒక దుర్మార్గుడు పుట్టాడన్నారు. దుర్మార్గుడిని ఎన్నుకున్నామని ప్రజ లందరికీ అర్థమైందని, వారు తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో ఉన్నారన్నారు. ఎన్నికల ఫలితాలు బాబుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. పదిరోజు లుగా నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు విపరీత మైన కూటమి గాలి వీస్తోందన్నారు. చిత్తూరు జిల్లాల్లో కూడా మార్పు కనిపిస్తోందన్నారు. ఫైగా ఏ సర్వేలోనూ వైసీపీకి అధికారం వస్తున్నట్టుగా లేదన్నారు.

● గాసిప్

శిష్యవాత్సల్యం

పూర్వాశ్రమంలో కాంగ్రెస్ పార్టీలో ఒక్క వెలుగు వెలిగిన పెద్దాయన. కాలం కలిసి రాక వైసీపీలో చేరి, టీడీపీ మీదుగా తిరిగి సొంతగూటికే చేరారా మధ్య. పార్టీల మధ్య దూకే సమయాల్లో రాజకీయ సన్యాసం గురించి కూడా ఆలోచించారేమో.. చాలా గ్యాప్ తీసేసుకున్నారు. ఈయనతోనే ఉన్న ప్రియశిష్యుడు ప్రస్తుతమున్న పార్టీని వీడి, పూర్వ కాంగ్రెస్‌లోకి జంప్ చేసి.. కుప్పం అభ్యర్థి అయిపో యారు. ఈ క్రమంలో ఇటీవల తమ పార్టీ ప్రచార యాత్ర ప్రారంభించిన ఈ పెద్దాయన శాంతిపురం మండలంలోని రెండు గ్రామాలకు వెళ్లారు. ఆ గ్రామాలలో ఆయన శిష్యుడి సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువ. పూర్వాశ్రమంలో అతడు



తనకిచ్చిన గట్టి మద్దతు, అప్పట్లో జిల్లా స్థాయి పదవి పొంద డంలో కూడగట్టిన పార్టీ శ్రేణుల సహకారం.. ఆయన కళ్ల ముందు కదిలిందేమో? శిష్య వాత్సల్యం ముంచుకొచ్చింది. తాను ప్రస్తుతమున్న పార్టీని, ఆ పార్టీ ప్రచారాన్ని మరచిపోయా రాయన. తన శిష్యుడికి ఓట్లేయాల్సిందిగా ఆ సామాజికవర్గం వారిని కోరివచ్చారట. కేవలం తన శిష్యుడైనంత మాత్రానికే, డిపాజిట్టు కూడా దక్కుతుందో లేదో తెలియని పార్టీ అభ్యర్థికి ఓట్లేయమని అడిగి వచ్చిన పెద్దాయన శిష్యవాత్సల్యం ఇప్పుడు శాంతిపురం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుత పార్టీ పెద్దలకు ఈ విషయం తెలిస్తే రాజకీయ మనుగడకు ప్రమాదమని తెలి సినా గురువుగా ఆయన చూపించిన తెగువకు శిష్యగణం కళ్లు చెమరుస్తున్నాయి. 'అదీ.. గురువంటే అలా ఉండాలి' అంటూ వాళ్లు ఆనందబాష్పాలను కారుస్తున్నారట. - కుప్పం

V ఆంధ్రజ్యోతి

చిత్తూరు జన కేతనం

www.andhrajyothy.com

బుధవారం 24 ఏప్రిల్ 2024

చెడిపోయిన రాజకీయ వ్యవస్థలోకి విశ్వసనీయత, నిజాయతీ అనే పదాలు రావాలి. ఏ రాజకీయ నాయకుడైనా ఒక పని చేస్తానని చెప్పి చేయకపోతే.. తన పదవికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి తేవాలి. మోసం చేసేవాడు.. అబద్ధాలు చెప్పేవాడు.. మీకు నాయకుడిగా కావాలా..? ఆలోచించుకోండి.


- ఆరేళ్ల కిందట జిల్లాలో పాదయాత్ర చేస్తూ జగన్ చెప్పిన మాటలు ఇవి.

ప్రతిపక్ష నేతగా.. అధికారంలోకి రాగానే చిత్తూరు డెయిరీని పునరుద్ధరిస్తాం. ఆ డెయిరీకి పాలు పోసే రైతులకు లీటరుకు రూ.4 చొప్పున రాయితీ ఇస్తామని చెబుతున్నా. జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించి చెరకు రైతుల కష్టాలు తీరుస్తా.

- 2018 జనవరిలో పాదయాత్ర సందర్భంగా జగన్ చెప్పిన మాటలివి.

ముఖ్యమంత్రిగా.. చిత్తూరు విజయా డెయిరీని అమూల్‌కు అప్పనంగా కట్టబెట్టేసి, ఇదే పునరుద్ధరణ అంటే ఎలా? ఇక, చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణ ఊసేలేదు. విపక్ష నేతగా ఇచ్చిన మాటను.. సీఎంగా నిలబెట్టుకోలేదు. నాడు మీరు వల్లించిన విశ్వసనీయత అంటే ఇదేనా?

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు



ఇదేనా విశ్వసనీయత జగన్?

● విపక్ష నేతగా విలువలు, చెప్పింది చేయడంపై పెద్దపెద్ద మాటలు చెప్పారు

● సీఎంగా నెరవేర్చారా



● విజయా డెయిరీ

'అమూల్'కు కట్టబెట్టేసి పునరుద్ధరణ అంటే ఎలా?

అధికారంలోకి రాగానే చిత్తూరు విజయా డెయిరీని పునరుద్ధరిస్తానని మాట ఇచ్చి.. అమూల్‌కు అప్పనంగా కట్టబెట్టేశారు. దీనినే పునరుద్ధరణ అంటూ సీఎం జగన్ గొప్పగా చెప్పడంపై జిల్లా పాడి రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఈ డెయిరీకి చెందిన 27 ఎకరాల భూములు, ఇతర ప్రాంతాల్లోని ఆస్తుల విలువ సుమారు రూ.500 కోట్లు. ఇంత ఆస్తిని ఏడాదికి కేవలం రూ.కోటి చొప్పున ఏకంగా 99 ఏళ్ల లీజుకు అమూల్ సంస్థకు అప్పగించేశారు. ఇదే అమూల్ మాకొద్దని కర్ణాటక, తమిళనాడు సీఎంలు తెగేసి చెప్పారు. సీఎం జగన్ మాత్రం దాన్ని చంకనెత్తుకున్నారు. పైగా పాడి రైతులకు చేస్తున్న గొప్ప కార్యక్రమంగా చెప్పుకుంటున్నారు.

డెయిరీ ఉద్యోగులను పట్టించుకోని పాలకులు

అమూల్‌కు అప్పనంగా డెయిరీ ఇచ్చేసిన సీఎం జగన్ ఆ సంస్థ ఉద్యోగులను పట్టించుకోలేదు. జీతాలు రాలేదని డెయిరీ కార్మికులు(టైమ్ స్కేల్ ఉద్యోగులు) 221 రోజులుగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తూనే ఉన్నారు. 140 మందికి రూ.63 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నా పట్టించుకునే వాళ్లే కరువయ్యారు.విజయా డెయిరీని 'అమూల్'కు కట్టబెట్టేందుకు చూపిన ఉత్సాహం..ఉద్యోగుల జీతాలపై చూపకపోవడం మానవీయమేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



తీపి మాటలు.. చేదు చేతలు

చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణ హామీ గాలికే

చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తానని హామీనిచ్చిన జగన్.. ఈ ఐదేళ్లలో పట్టించుకోలేదు. గతేడాది ఈ రెండు ఫ్యాక్టరీల ఆస్తులు, అప్పులు తేల్చడానికి లిక్విడేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఉద్యోగుల కుటుంబాలకు మాత్రం బకాయిలను చెల్లించారు. ఈ రెండు ఫ్యాక్టరీలు ఉన్నప్పుడు జిల్లాలో రైతులు 54 వేల హెక్టార్లలో చెరకును సాగు చేసేవారు. ఇప్పుడు సాగు సగానికి సగం తగ్గింది.

చిత్తూరు ఫ్యాక్టరీ పరిస్థితి

చిత్తూరు కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ 1964లో ప్రారంభమైంది. 2003-04 వరకు 16 వేల మంది రైతులతో ఓ వెలుగు వెలిగింది. తరువాత క్రమంగా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 2014-15లో క్రషింగ్ చేయకుండా ఆపేసింది. క్రమంగా మూత పడింది. మూతపడే సమయానికి రైతులకు బకాయిపడిన రూ.13 కోట్లను టీడీపీ ప్రభుత్వం చెల్లించేసింది. దీనిని తెరిపిస్తానని జగన్ హామీ ఇస్తే చెరకు రైతులు, సంస్థ ఉద్యోగులు సంబరపడ్డారు. ఈ అయిదేళ్లు హామీ అమలుకు సీఎం కనీస ప్రయత్నం కూడా చెయ్యకపోవడంతో మోసపోయామని రైతులు, సంస్థ ఉద్యోగులు గుర్తించారు.

ప్రైవేటు ఫ్యాక్టరీలతో రైతులకు తీవ్ర నష్టం

జిల్లాలోని ప్రైవేటు చక్కెర ఫ్యాక్టరీల యాజమాన్యం ఇష్టానుసారం పర్మిట్లు ఇవ్వడంతో ఓ రకంగా, బిల్లులు సకాలంలో అందించకపోవడంతో మరో రకంగా రైతులు నష్టపోతున్నారు. ఈ ప్రైవేటు ఫ్యాక్టరీలు కుమ్మక్కై మద్దతు ధర విషయంలో రైతులకు అన్యాయం చేసిన సందర్భాలున్నాయి. నేతమ్స్, మయూర చక్కెర కర్మాగారాలు మూడేళ్లుగా రూ.కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో, రైతులు అప్పులపాలయ్యారు. మరికొందరు అప్పులు చెల్లించలేక భూములను అమ్ముకున్నారు.

సహకార ఫ్యాక్టరీతో లాభాలు

సహకార ఫ్యాక్టరీల్లో సీనియారిటీ ప్రకారం రైతులకు పర్మిట్లు అందేవి. రైతు కూడా భాగస్వామి కావడంతో లాభాల్లో వాటా వస్తుంది. సహకార సిబ్బంది రైతుల పొలాల వద్దకు వచ్చి చెరకు పంటలో చక్కెర శాతాన్ని పరీక్షించి పర్మిట్లు మంజూరు చేసేవారు. ప్రస్తుతం ప్రైవేటు యాజమాన్యం ఇలా చేయకుండా, వెనుక పంట ముందుగా, ముందేసిన పంట ఆలస్యంగా క్రషింగుకు తీసుకుంటున్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూసినా బిల్లుల ఎరావడం లేదు. సహకార ఫ్యాక్టరీలు మూత పడడంతో ఇలా అన్ని విధాలుగా రైతులు నష్టపోతున్నారు.

డెయిరీ మూతకు కారణమేంటి?

తన హెరిటేజ్ కోసం నాడు చిత్తూరు డెయిరీని చంద్రబాబు మూసివేయించారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. కానీ.. మూతపడటానికి కారణాలను పరిశీలిస్తే.. రాష్ట్రంలో 1990-2000 మధ్య అనేక సహకార డెయిరీలు మూత పడ్డాయి. దీనికి ప్రధాన కారణం 1992లో కేంద్రం మిల్క్ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్ (ఎంఅండ్‌పీవో) జారీ చేసి, ప్రైవేటు డెయిరీలకు అవకాశం కల్పించింది. అప్పటికే ఆపరేషన్ ఫ్లడ్3 ద్వారా యూరప్ నుంచి వచ్చిన పాలపొడిని ఉచితంగా సరఫరా చేసింది. దీంతో పాల ధర తగ్గి, డెయిరీలు నష్టాల బారిన పడ్డాయి. చిత్తూరు డెయిరీ పాలను ఏడాదిలో ఏడు నెలలే ఏపీ డెయిరీ ఫెడరేషన్ కొనేది. మిగతా రోజుల్లో ఆవు పాల వంకతో కొనేది కాదు. ఏడాదంతా కాంట్రాక్టు ఇచ్చేది కాదు. పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేసుకోవడానికి రాష్ట్ర యూనియన్ అనుమతి ఇచ్చేది కాదు. చిత్తూరు డెయిరీ రోజుకు 2.75 లక్షల లీటర్లు సేకరిస్తే 1.60 లక్షల లీటర్లే కొన్న పరిస్థితి. అప్పట్లో డెయిరీకి తిరుపతి మినహా ఇతర పట్టణాల్లో పెద్దగా మార్కెట్ లేదు. టీటీడీ కిలో నెయ్యి రూ.45 చొప్పున టెండర్లు ఇచ్చేది. కానీ కిలో నెయ్యి వ్యయం రూ.54 దాకా ఉండేది. ఈ కారణాలతో సంస్థకు 1991 నాటికే రూ.కోట్లలో నష్టం వచ్చింది. 1993లో హెరిటేజ్ పెట్టే నాటికి చిత్తూరు డెయిరీ నష్టాల్లో కూరుకుపోయింది. 1992లో ఎంపీవో (డీ లైసెన్సింగ్) ద్వారా కేంద్రం ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించింది. ఫలితంగా చిత్తూరు జిల్లాలోనే 32 మిల్క్ బిల్డింగ్ సెంటర్లు నెలకొల్పారు. ప్రస్తుతం జిల్లాలో 10 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. 30 ప్రైవేటు డెయిరీలున్నాయి.

పాడి రైతులకు అన్యాయం



కోట్లాది రూపాయలు విలువచేసే విజయా డెయిరీని ప్రైవేటు సంస్థకు ఇస్తే తిరిగి రాదని అప్పుడే చెప్పాను. అమూల్ సంస్థకు 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఒంటరి పోరాటాలు చేశాను. మంత్రులను సభల్లో ప్రశ్నించాను. సీఎం జగన్ చిత్తూరుకు వచ్చినప్పుడు నిరసన తెలుపుతానని తెలిసి పోలీసులు నన్ను హౌస్ అరెస్టు చేశారు. అమూల్ సంస్థకు డెయిరీని అప్పగించడం పాడి రైతులకు అన్యాయం చేయడమే.

- ఈదల వెంకటాచలం నాయుడు, ఉద్యమకారుడు, జిల్లా పాడి రైతుల సంఘం

ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం సరికాదు



విజయా డెయిరీని అమూల్ ప్రైవేటు సంస్థకు అప్పగించడం సరికాదు. దీని వల్ల రైతులకు బాగా నష్టం కలుగుతుంది. డెయిరీని కోఆపరేటివ్ సొసైటీకి అప్పగించి ఉంటే రైతులకు కొంత ప్రయోజనం ఉండేది. ప్రభుత్వ యాజమాన్యంలో గిట్టుబాటు ధర ఉండేది. ఇప్పుడు ప్రైవేటు సంస్థ నిర్ణయించినదే పాల ధర. దీని ద్వారా రైతులకు నష్టం తప్ప, లాభం ఉండదు.

- ఎ.రాధిక, పాడి రైతు, చిత్తూరు రూరల్

మా బతుకులు రోడ్డున పడ్డాయి



డెయిరీలోని 140 మంది వర్కర్లకు రూ.63 కోట్లు బకాయిలు ఇంత వరకు రాలేదు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మా బతుకులు రోడ్డున పడుతున్నాయి. 220 రోజులకు పైగా డెయిరీ ముందు దీక్ష చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ ఆస్తిని అతి తక్కువ ధరకు విజయా డెయిరీని ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించింది.

- పీడీ కుమార్, టైంస్కేల్ వర్కర్, విజయా డెయిరీ



పాచికాల్వ గంగమ్మకు ప్రత్యేక పూజలు

తిరుమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో స్థానికులు నివాసముండే బాలాజీనగర్‌కు సమీపంలోని గ్రామ దేవత పాచికాల్వ గంగమ్మ ఆలయంలో మంగళవారం చిత్రపౌర్ణమి మహోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారికి ఉదయం అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఉదయం 11 గంటలకు సహస్రనామ కుంకుమార్చన, మహానివేదన పూజలు నిర్వహించడంతోపాటు చివరిలో మహామంగళ హారతిని సమర్పించారు. 12 గంటల తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించి అన్నప్రసాదాల వితరణ చేశారు.

అయ్యా... బటన్ నొక్కారు

● వైఎస్ఆర్ ఆసరా పడలేదు

● ఆందోళనలో మహిళా స్వయం సహాయక సభ్యులు

చంద్రగిరి, ఏప్రిల్ 23: అయ్యా సీఎం జగన్ గారూ.. బటన్ నొక్కారు.. ఇంకా వైఎస్ఆర్ ఆసరా నగదు పడలేదు అంటూ చంద్రగిరి మండలంలోని స్వయం సహాయక మహిళా సభ్యులు ఆందోళ చెందుతున్నారు. జనవరి 23న ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా అర్హులైన స్వయం సహాయక సభ్యులకు నగదు జమ చేయడానికి బటన్ నొక్కారు. అయితే కొంతమందికి మాత్రమే నగదు పడింది. కొంతమందికి పడకపోవడంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత వస్తుందో రాదో అంటూ ఆందోళన చెందుతున్నారు. మండలంలో 1161 మహిళా స్వయం సహాయక మహిళా గ్రూప్‌లు ఉన్నాయి. ఈ గ్రూప సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మొత్తం రూ.11,19,15,600 లు సభ్యుల అకౌంట్లలో ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 876 గ్రూప్‌లకు రూ.8,56,85,540లు మాత్రమే జమైంది. అయితే ఇంకా 285 గ్రూప్‌లకు వైఎస్ఆర్ ఆసరా నగదు జమ కావాల్సి ఉంది. పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో అసలు తమకు వైఎస్ఆర్ ఆసరా పడుతుందో లేదో అంటూ ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ నాయకులు ఆసరా పడుతుందని చెబుతున్నా, మహిళా సభ్యులు మాత్రం వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు.


సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 23: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి ఎన్నికల అధికారులతో సమీక్షించారు. వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే నాలుగు కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయని, మరిన్ని బలగాలు జిల్లాకు రానున్నాయని తెలిపారు. ఈఆర్వోలు అదితిసింగ్, నిషాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

ముగిసిన కోదండరాముడి తెప్పోత్సవాలు





తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 23: తిరుపతి కోదండరాముడి తెప్పోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున ఉదయం స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఏడు నుంచి రాత్రి 8.30 గంటల వరకు సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా రామచంద్ర పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, అక్కడ తెప్పోత్సవం నిర్వహించారు. ఉత్సవర్లు తొమ్మిదిమార్లు పుష్కరిణి జలాల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా గంగమ్మగుడిలో చండీ హోమం





తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 23: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జాతర ముందు రెండో మంగళవారం పూజాదికాలు నిర్వహించారు. సంప్రదాయం మేరకు అమ్మవారిని, గర్భాలయాన్ని మొక్కజొన్నకంకులతో తీర్చిదిద్దారు. ఉదయం 8.30 గంటలకు చండీ హోమం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేసి, బంగారు ముఖబింబం, బంగారు వజ్రకిరీటంతో విశేషంగా అలంకరించారు. ఉదయం 9.30 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.మమత పర్యవేక్షించారు.

ఇద్దరికి డాక్టరేట్ల ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 23: ఎస్వీయూనివర్సిటీ ఇద్దరు పీహెచ్‌డీ పరిశోధకులకు డాక్టరేట్లను ప్రకటించిందని సీఈ దామ్లానాయక్ తెలిపారు. ● కంప్యూటర్ సైన్స్ విభాగ పరిశోధకురాలు ఓ.యామిని 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏ నావెల్ ఫీచర్ ప్రాబబిలిటీ బేస్డ్ డెసిషన్ ట్రీ అల్గారిథం విత్ అప్లికేషన్' అనే అంశంపై డాక్టర్ జీవీ రమేష్‌బాబు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ● ఎకనమిక్స్ పరిశోధకురాలు పి.శివమ్మ 'గ్రోత్, కాంపోజిషన్ అండ్ డైరెక్షన్ ఆఫ్ ఇండియన్స్ ఫారిన్ ట్రేడ్' అనే అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ కృష్ణమూర్తి పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.



యామిని - శివమ్మ

షర్మిల, సునీత ప్రాణాలకు... మా ప్రాణాలను అడ్డేస్తాం: నారాయణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23: 'వైఎస్ వివేకా హత్య కేసులో న్యాయం కోసం పోరాడుతున్న షర్మిల, సునీత ప్రాణాలకు మా ప్రాణాలను అడ్డేస్తాం' అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. 'వివేకా హత్య కేసులో మా ప్రాణాలకు తెగించి పోరాడుతున్నాం' అంటూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. గుంటూరులో మంగళ వారం విలేకరులతో మాట్లాడుతూ.. 'వైఎస్ వివేకాను ఎవరు చంపారో ప్రతి ఒక్కరికీ తెలుసు. సీబీఐ చెప్పిన విషయాలనే షర్మిల, సునీతలు చెబుతు న్నారు. వారేమీ కొత్త విషయాల్ని చెప్పడం లేదు. జగన్ రాక్షస పాలనపై షర్మిల మాట్లాడుతుందే తప్ప, కుటుంబ విభేదాలు గురించి ఎక్కడా ఆమె ప్రస్తావించడం లేదు' అని నారాయణ అన్నారు.

అసెంబ్లీకి పోటీ చేయను: సుంకర పద్మశ్రీ

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తన కేటాయించిన విజయవాడ తూర్పు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయడానికి ఏపీసీసీ వర్కింగ్ ప్రెసి డెంట్ సుంకర పద్మశ్రీ నిరాకరించారు. అదే విషయాన్ని ఆమె మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. అలాగే బీ ఫామ్ తీసుకోవాలంటూ మంగళ వారం తనకు ఫోన్ చేసిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యక్తిగత కార్యదర్శికి కూడా పద్మశ్రీ తేల్చి చెప్పారు. 'నేను విజయవాడ లోక్‌సభకు పోటీ చేస్తానని దరఖాస్తు చేసుకున్నా. అదే విషయాన్ని పార్టీ నాయకత్వానికి తెలియజేశాను. నేను అసెంబ్లీ స్థానానికి పోటీ చేయను. కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తా. నా నిర్ణయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం సహృదయంతో అర్థం చేసు కుంటుందని ఆశిస్తున్నా' అంటూ ఆమె మంగళవారం ఓ ప్రకటన చేశారు.

మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న ప్రధాని మోదీ: మధు

గన్నవరం, ఏప్రిల్ 23: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశ సంపదను ముస్లింలకు దోచిపెడతారని ప్రధాని మోదీ అనడం దుర్మార్గమని సీపీఎం మాజీ ఎంపీ మధు అన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశంలో తిరిగి అధికా రంలోకి రావాలని చూస్తున్న బీజేపీని ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఐదేళ్ల పాటు ముదనష్టపు పాలన సాగించిన వైసీపీని, బీజేపీకి అంటకాగుతున్న టీడీపీని నమ్మకూడదన్నారు. గన్నవరం సీపీఎం కార్యాల యంలో ఇండియా కూటమి సమావేశం మంగళవారం టీవీ లక్ష్మణస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాజస్థాన్ ఎన్ని కల సభలో రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా మతాన్ని రెచ్చగొట్టే విధంగా మోదీ వ్యాఖ్యలు చేయటంపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు.

పంచాయతీల్లో ఉపాధి పనులు: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి పనులు చేపట్టాలని సీఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో తాగునీరు, ఉపాధి హామీ పనులు, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, పరిస్థితులపై ఆయన మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పనులు నిర్వహించిన కూలీలకు సకా లంలో కూలి సొమ్ము చెల్లించాలని చెప్పారు. ప్రకాశం బ్యారేజి నుంచి నాగా ర్జున సాగర్ కుడి ప్రధాన కాలవ ద్వారా విడుదల చేసిన నీటితో సకాలంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

కూటమి గెలుపుతోనే దేశాభివృద్ధి: మురుగన్

కైకలూరు, ఏప్రిల్ 23: కూటమితోనే రాష్ట్ర, దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ప్రజలంతా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మత్స్య శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ అన్నారు. మంగళవారం ఏలూరు జిల్లా కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ నామినేషన్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురుగన్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే కొల్లేరు సమస్యల పరిష్కా రం, అలాగే ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

వైసీపీ పాలనలో దళితులపై దమనకాండ: మల్లెల

పిడుగురాళ్ల, ఏప్రిల్ 23: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎందరో దళి తులపై దాడులు, హత్యాయత్నాలు, మహిళలపై అత్యాచారాలతో పాటు దమనకాండ జరిగిందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట రావు తెలిపారు. 'రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దమనకాండ పూర్తిగా తొలగిపోవాలన్నా, సంక్షేమ పథకాలు అర్హులకు అందాలన్నా టీడీపీ పాలన తోనే సాధ్యమవుతుంది. మాస్క్ అడిగిన పాపానికి విశాఖలో డాక్టర్ సుధాక ర్‌ను తీవ్రంగా హింసించి మరణానికి కారణమయ్యారు. దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేశారు. న్యాయం కావాలని వేడుకున్న మరికొందరు నేతలకు శిరోముండనం చేశారు. ఈ ఘటనలన్నీ వైసీపీ పాలనలోనే జరి గాయి. ఇలాంటి దమనకాండ, అన్యాయాలు మరలా జరుగకుండా ఉండా లంటే వైసీపీ నేతలకు బుద్ధి చెప్పాలి' అని పిలుపునిచ్చారు.

నవరత్నాల చాటున మోసం: కోవూరి లక్ష్మి

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో నవరత్నాల చాటున చాలా మోసం జరుగుతోంది. మహిళలపై అరాచకాలు జరుగుతున్నాయి. మహిళలు ఎవరూ మోసపోవద్దు' అని ఢిల్లీలో వేలు కోసుకుని నిరసన వ్యక్తం చేసిన కోవూరి లక్ష్మి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యతో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. 'నేను నివశిస్తున్న ప్రత్తిపాడు స్వర్ణభారతి నగర్‌లో మైనర్ బాలికలకు జరుగుతున్న అన్యాయం అంతా, ఇంతా కాదు. వారిని గంజా యికి అలవాటు చేసి, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మార్చారు. తల్లిదం డ్రులు పనికివెళ్తే, ఇంట్లో ఉండే మైనర్ బాలికలను సైతం గంజాయికి అల వాటు చేసి, అఘాయిత్యాలకు పాల్పడ్డారు' అని లక్ష్మి అన్నారు. వర్ల మాట్లా డుతూ, 'దళిత బిడ్డలకు స్వేచ్ఛగా తిరిగే హక్కు లేదా? మనం ఆధునిక సమాజాంలో ఉన్నామా? ఆటవిక సమాజంలో ఉన్నామా? ఆటవిక సమాజా నికి మారు పేరు జగన్ పాలన' అని విమర్శించారు.

3 పేరుతో 400 కోట్లు నొక్కేశారు: గుర్నాథం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మూడు రాజధానులు పేరు చెప్పి ప్రవాసాంధ్రుల నుంచి రూ.400 కోట్లు వసూలు చేసి వైసీపీ నాయకులే నొక్కేశారని బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షుడు, ఎత్తేసిన మూడు రాజ ధానుల శిబిరం మాజీ నిర్వాహకుడు మాదిగాని గురునాథం ఆరోపించారు. మూడు రాజధానుల ఉద్యమం తానే చేయిస్తున్నట్లు సజ్జల, జగన్‌ను నమ్మించి అనంతవరం ఇసుక ర్యాంప్ నజరానాగా పొందారని ఆరోపించారు. జగన్, సజ్జల, కొడాలి నాని, నందిగం సురేశ్‌లు అమరావతిని అడ్డం పెట్టు కుని సర్వం దోచేశారని తెలిపారు. మూడు రాజధానుల ఉద్యమ నేతలకు ఇళ్ల స్థలాలు, రూ.25 లక్షలు, కార్లు ఇస్తామని ట్రాప్ చేసి ఆశ చూపార న్నారు. మూడు రాజధానులు శిబిరానికి వచ్చే ఒక్కొకరికి రూ.500లు ఇస్తు న్నట్లు దొంగ లెక్కలు రాసి ఆ డబ్బు కూడా నందిగం సురేశ్, సజ్జల, కొడాలి నాని కూటమి నొక్కేసిందన్నారు.

చిత్తుగా ఓడతామని జగన్‌కు అర్థమైంది: మాణిక్యాలరావు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోతున్నామని జగన్‌కు బాగా అర్థమైందని టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు అన్నారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్ని కల్లో ఎలాగైనా గెలిచి తీరాలనే ఉద్దేశంతో జగన్ దళితులపై ప్రేమ ఉన్నట్లు వారిలో భ్రమలు కల్పించారన్నారు. ఆ భ్రమలో పడి దళితులు ఓట్లు వేయ డంతో జగన్ గెలిచారన్నారు. 2019 ఎన్నికల్లో దళితులకు, తనకు రక్త సంబంధమున్నట్లు సెంటిమెంట్‌తో నమ్మించారని, ఇప్పుడు ఓటమి భయంతో దళితులపై దాడులకు వైసీపీ శ్రేణులను పురిగొల్పుతున్నారని ఆరోపించారు. దళితులపై మల, మూత్ర విసర్జన, అంటరానితనం లాంటి దుర్మార్గపు, అవ మానకరపు క్రియలన్నీ జగన్ పాలనలో జరిగాయన్నారు. జగన్ పాలన పోయి ఈసీ పాలన వచ్చినప్పటికీ దళితుల మీద దాడులు, హత్యలు ఆగడం లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను కాపాడాల్సిన బాధ్యత ఈసీపై ఉందని, జగన్ సాగించిన అరాచకాలకు శిక్ష పడాలని మాణిక్యాల రావు పేర్కొన్నారు.

ఇంకో రూ.3,000 కోట్ల అప్పు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం మంగళవారం కొత్తగా ఇంకో రూ.3,000 కోట్ల అప్పు తెచ్చింది. రిజర్వు బ్యాంకు నిర్వహించిన వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు అమ్మి ఈ రుణం తీసుకొచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలలకు గాను రాష్ట్రానికి కేంద్రం రూ.47,000 కోట్ల అప్పులకు అనుమతిచ్చింది. ఇందులో ఏప్రిల్ 2న రూ.4వేల కోట్ల అప్పులు తెచ్చారు. ఇప్పుడు మరో రూ.3వేల కోట్లు రుణం తీసుకున్నారు. అంటే 20 రోజుల్లోనే రూ.7వేల కోట్లు అప్పులు తెచ్చినట్లయింది.

పక్క రాష్ట్రాలకూ వైసీపీ కిక్కు!

- వైసీపీ పెద్దల చేతిలో ఎస్పీవై డిస్టిలరీ
- దాని నుంచి ఈఎన్ఏ ఎగుమతికి అనుమతి
- 75శాతం అమ్మకానికి గ్రీన్‌సిగ్నల్
- ఎన్నికల సమయంలో అనుమతి జారీ
- మాజీ ఎండీ ప్రతిపాదనకు ఇప్పుడు ఓకే



అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం వ్యాపారం చేస్తున్న వైసీపీ పెద్దల కన్ను ఇప్పుడు పక్క రాష్ట్రాలపై పడింది. సార్వ త్రిక ఎన్నికల వేళ దేశవ్యాప్తంగా మద్యానికి విపరీత మైన డిమాండ్ ఏర్పడిన తరుణంలో రాష్ట్రంలోని అతి పెద్ద డిస్టిలరీ నుంచి మద్యం తయారీకి ముడిసరుకైన ఈఎన్ఏను ఎగుమతి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే అది అనధికారికంగా వైసీపీ పెద్దల చేతుల్లో ఉండటమే ఇప్పుడు చర్చనీ యాంశమవుతోంది. మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డికి చెందిన నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో డిస్టిలరీని వైసీపీ అధికారంలోకి వచ్చాక పార్టీ పెద్దలు అనధికారికంగా తమ చేతుల్లోకి తీసుకున్నారు. డిస్టిలరీ యాజమాన్యా నికి కొంత నగదు చెల్లిస్తూ.. అందులో ఎక్కువగా జే బ్రాండ్లు తయారు చేస్తున్నారు. ఆ మద్యాన్నే రాష్ట్రం లోని షాపుల్లో అమ్మిస్తున్నారు. అంతటితో ఆగకుండా ఇప్పుడు బయటి రాష్ట్రాలకు ఈఎన్ఏను ఎగుమతి చేసుకునేందుకు ఎక్సైజ్ శాఖ అనుమతి మంజూరు చేసింది. ఈమేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్పత్తి చేసే ఈఎన్ఏలో 75శాతం బయటకు ఎగు మతి చేసుకోవచ్చని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని డిస్టి లరీల్లో ఎస్పీవై డిస్టిలరీ అతి పెద్దది. ఏడాదికి పది కోట్ల లీటర్లకుపైగానే ఈఎన్ఏ ఉత్పత్తి చేసే సామర్థ్యం దీనికి ఉంది. అంటే అందులో 7.5 కోట్ల లీటర్లకు తక్కువ కాకుండా బయటి రాష్ట్రాలకు అమ్ముకోవచ్చు. అందుకుగాను ఎగుమతి సుంకం కింద రాష్ట్రానికి లీట రుకు ఒక రూపాయి చెల్లిస్తారు. ఆయా రాష్ట్రాల్లో మద్యం అవసరాలకు అనుగుణంగా ఈఎన్ఏను ఎగు మతి చేసి, డిమాండ్‌కు అనుగుణంగా ధర వసూలు చేస్తారు. ఈఎన్ఏ లీటరు ధర ప్రస్తుతం రూ.70 నుంచి రూ.75 ఉంది. ఇప్పుడు ఎన్నికలు కావడంతో ఇంకా ఎక్కువ పలికే అవకాశం ఉంది. ఇలా ఎగుమ తులకు అనుమతులివ్వడం సాధారణమే అయినా, ఎన్నికల వేళ అందులోనూ కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఇంత పెద్ద డిస్టిలరీకి ఎందుకు అనుమతి చ్చారన్నదే అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది. బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి అనేక ఆరోపణలతో బదిలీ అయ్యాక ఈ అనుమతులు జారీ కావడం గమనార్హం. ఆయన ఉన్నప్పుడు పెట్టిన ప్రతిపాదన లకు ఇప్పుడు అనుమతులు జారీ చేశారు. అయితే ఇది ఎన్నికల కోడ్‌కు విరుద్ధ మని అంటున్నారు.

ఎస్పీవైదే అత్యధిక వాటా

లిక్కర్ ఉత్పత్తి చేసే డిస్టిలరీలు రాష్ట్రంలో 20 ఉన్నాయి. అన్ని డిస్టిలరీల ఉత్పత్తి సామర్థ్యం ఏడా దికి 4,187 లక్షల లీటర్లు. అందులో ఒక్క ఎస్పీవై డిస్టిలరీ ఉత్పత్తి సామర్థ్యమే వెయ్యి లక్షల లీటర్లు. అంటే మొత్తం డిస్టిలరీల్లో నాలుగో వంతు వాటా ఒక్క ఎస్పీవైదే. అందుకే కావాల్సినంత మద్యం ఉత్పత్తి చేసుకోవచ్చని వైసీపీ నేతలు ఎస్పీవై డిస్టి లరీని వాడుకుంటున్నారు. ఇప్పుడు దాని నుంచి ఎగుమతికి అనుమతులు కూడా తెచ్చుకున్నారు.

మొత్తం వారి చేతుల్లోనే

ఎస్పీవై డిస్టిలరీకి గత ప్రభుత్వంలోనే అనుమతులు లభించినా ఈ ప్రభుత్వంలోనే మద్యం ఉత్పత్తి ప్రారం భమైంది. భారీ సామర్థ్యం కలిగిన కొత్త డిస్టిలరీ కావ డంతో అధికార పార్టీ నేతలు దానిని అనధికారికంగా చేతుల్లోకి తీసుకున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన జే బ్రాండ్ల తయారీకి దానిని వేదికగా చేసుకున్నారు. రాయలసీమకు చెందిన ఇద్దరు మంత్రులు, ఒక ఎంపీ ఇందులో కీలకంగా ఉన్నారు. ఇంతకాలం ఎడాపెడా మద్యం తయారు చేయించి, ఇప్పుడు మిగులు ఈఎన్ ఏను ఎగుమతి చేసుకునే అనుమతులు పొందారు. డిస్టిలరీల్లో తయారయ్యే ఈఎన్ఏలో 50శాతం ఎగు మతి చేసుకునేందుకు గత ప్రభుత్వంలో అనుమతి ఉండేది. దానిని వైసీపీ ప్రభుత్వం 75శాతానికి పెంచింది. తద్వారా ఎగుమతి సుంకాన్ని పెంచుకుని అదనపు ఆదాయాన్ని పొందుతోంది. దాంతోపాటు డిస్టి లరీలకు అనధికారికంగా మేలు చేస్తోంది.

వైసీపీ అభ్యర్థి వంగా గీతకు చుక్కెదురు

- సమస్యలు పరిష్కరించకుండా ఓట్లడగడానికి వస్తారా?
- గొల్లప్రోలులో నిలదీసిన మహిళలు



గొల్లప్రోలు, ఏప్రిల్ 23: పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతాకు చేదు అనుభవం ఎదురైంది. సమస్యలు పరిష్కరిం చకుండా ఓట్లడగడానికి వస్తా రా అంటూ మహిళలు నిలదీశారు. పిఠాపురంలోని గొల్లప్రోలు పట్ట ణంలోని 20వ వార్డులో సోమ వారం ఈ పరిస్థితి ఎదురైంది. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెనుక వీధిలో ప్రచారం నిర్వ హిస్తూ రోడ్డు పక్కన ఇళ్లలో ఉన్న మహిళలను పిలిచారు. తమకు తాగునీరు లేదు, రోడ్లు, డ్రైన్లు అధ్వానంగా ఉన్నాయని, సుద్దగడ్డ కాలువ లకు వరదలు వస్తే వరద నీటితో సహవాసం చేస్తున్నామని, ఇన్ని సమ స్యలతో సతమతమవుతున్నా పరిష్కరించరు కానీ.. మీరు ఓట్లడగడా నికి వస్తే మేము రావాలా అంటూ స్థానిక మహిళలు నిలదీశారు.

మా చిన్నారికి ప్రాణ భిక్ష పెట్టండి





పుంగనూరు రూరల్, ఏప్రిల్ 23: కిడ్నీల వ్యాధితో బాధపడుతూ విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన బిడ్డ ప్రాణాలు కాపాడేందుకు దాతలు సహాయం చేయా లని చిత్తూరు జిల్లా పుంగనూరు తూర్పుమొగసా లకు చెందిన ప్రేమ్‌కుమార్, సుభాషిణి దంపతులు వేడు కుంటున్నారు. తమ కుమార్తె జెస్సిక(7)కు రెండు కిడ్నీలు చెడిపోయినట్లు డాక్టర్లు నిర్ధా రించారని తెలిపారు. విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చేర్పించామని, తమకు ఉన్న ఆస్తులు విక్రయించి దాదాపు రూ.10లక్షలు ఖర్చు చేశామని, ఇంకా రూ.7లక్షలు ఖర్చు చేస్తే ప్రా ణాలతో బయటపడుతుందని వైద్యులు చెప్పడంతో దాతల సహాయం కోరుతున్నామని చెప్పారు. సాయం చేయదలచిన వారు 7799390447(ఫోన్ పే)గాని, పుంగనూరుకు చెంది న ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతా నెంబరు 3457613 3056కు గాని అందించాలని కోరారు.

ఖమ్మం బరిలో ప్రియాంక?

- అవకాశాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రోజుకో మలుపు తిరుగుతున్న ఖమ్మం సీటు పంచాయితీ.. చివరికి అనూహ్య మైన మలుపు తీసుకోనుందా? అక్కడి నుంచి కాంగ్రెస్ అధి ష్ఠానం ఏకంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీనే బరిలోకి దింపే అవకాశం ఉందా? రాహుల్‌గాంధీ నిర్ణయం పైనే ఇది ఆధారపడి ఉందా?- ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్రంగా నడుస్తున్న చర్చ ఇది. యూపీలోని అమేథీ, రాయ్‌బ రేలీ సీట్లలో మొదటి నుంచీ గాంధీ కుటుంబమే పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. గత ఎన్నికల్లోనూ అమేథీ నుంచి రాహుల్‌గాంధీ, రాయ్‌బరేలీ నుంచి సోనియాగాంధీ పోటీ చేశారు. అమేథీతోపాటు వయనాడ్‌లో పోటీ చేసిన రాహుల్ వయనాడ్‌లో గెలిచి అమేథీలో మాత్రం స్మృతీ ఇరానీ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ వయనాడ్ నుంచి రాహుల్‌గాంధీ ఇప్పటికే నామినేషన్ వేశారు. అమేథీని రాహుల్‌గాంధీ నిర్ణయం కోసం అధిష్ఠానం పెండింగ్‌లో పెట్టింది. మరోవైపు, సోనియాగాంధీ రాజ్యసభకు వెళ్లడంతో రాయ్‌బరేలీ సీటు కూడా పెండింగ్‌లో ఉంది. ఈ రెండు సీట్లనూ రాహుల్, ప్రియాంకల కోసమే అధిష్ఠానం పెండిం గ్‌లో ఉంచింది. అమేథీ నుంచి రాహుల్‌గాంధీ పోటీ చేయడా నికి అంగీకరిస్తే.. ప్రియాంకను సైతం రాయ్‌బరేలీతో పాటుగా దక్షిణాది రాష్ట్రాల్లో ఏదో ఒక నియోజకవర్గం నుంచి బరిలోకి దించే అంశాన్ని అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగు తోంది. కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా గెలిచే సీటైన ఖమ్మం నుంచే ప్రియాంకను ఎందుకు బరిలోకి దించకూడదన్న ఆలోచనా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఒకవేళ రాహుల్‌గాంధీ.. వయనా డ్‌కే పరిమితమైన పక్షంలో ప్రియాంక అమేథీ లేదా రాయ్‌బరే లీల్లో ఒకదాని నుంచి బరిలోకి దిగుతారని పేర్కొంటున్నారు.

'బొత్స' కబ్జాలో విశాఖ స్టీల్ గనులు: పట్టాభి

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఫ్యాక్ట రీకి అనుబంధంగా విజయనగరం జిల్లాలో ఉన్న మాంగనీసు, సిలికా గనులను మంత్రి బొత్స కుటుంబం చెరపట్టిందని టీడీ పీ ఆరోపించింది. ఈ గనులపై తమకు ఉన్న లీజు హక్కులు పొడిగించాలని ఉక్కు ఫ్యాక్టరీ యాజమాన్యం ఎన్నిసార్లు లేఖలు రాసినా సీఎం జగన్ వాటిని బుట్ట దాఖలు చేసి తమ మంత్రుల అడ్డగోలు దోపిడీకి సహకరించారని టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి విమర్శించారు. ముఖ్యమంత్రి సీట్లో కూర్చుని వ్యాపారం చేసుకొంటున్న జగన్‌కు విజయనగరం జిల్లాకు వెళ్లి ఓట్లు అడగడానికి ఏం నైతిక హక్కు ఉందని ఆయన ప్రశ్నిం చారు. 'గనుల్లో జగన్ దోపిడీని ఆయన మంత్రులు, ఎమ్మె ల్యేలు కూడా అందిపుచ్చుకొని అయినకాడికి పిండుకొంటు న్నారు. విజయనగరం జిల్లాలోని మెరక ముడిదాం మండలం లోని 1,000 ఎకరాల గర్భామ్ మాంగనీసు గనిని మంత్రి బొత్స కుటుంబం కబ్జా చేసింది. ఈ గని ఇప్పటిదాకా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి క్యాప్టివ్ గనిగా ఉంది. 2022 అక్టోబరులో ఈ లీజు గడువు ముగిసింది. అప్పటి నుంచి ఆ గనిని బొత్స కుటుంబం కబ్జా చేసి తన ఆధీనంలో పెట్టుకొంది. గని చేతిలో లేకపోవడంతో విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ఒక టన్ను మాంగనీసును రూ.14- 15 వేలకు బయట కొనాల్సి వస్తోంది. ఈ ఏడాదిన్న రలో ఆ గనిలో ఎంత మాంగనీసును బొత్స కుటుంబం ఎంత అక్రమంగా తవ్వి ఎంత సంపాదించిందో ఆ లెక్కలు వారికీ, జగన్‌కు మాత్రమే తెలుసు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత దుర్మార్గంగా వ్యవహరించలేదు' అని పట్టాభి చెప్పారు.

కోడ్ ఉల్లంఘనలపై 'త్రిబుల్ సీ' నిఘా

- సీఈవో కార్యాలయం నుంచే జీపీఎస్ ట్రాకింగ్
- మద్యం అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ఠ చర్యలు
- సీఈవో ఎంకే మీనా ప్రత్యేక పర్యవేక్షణ



కమాండ్ కంట్రోల్ రూంను సందర్శించి అక్కడి సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి ఎంకే మీనా

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్ని కల సందర్భంగా ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకూ తావులే కుండా ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా, నిష్ప క్షపాతంగా నిర్వహించాలనే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(త్రిబుల్ సి) ద్వారా రాష్ట్రాన్ని జల్లెడపడుతున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. మంగళవారం ఈ మేరకు సీఈవో కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం.. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా కార్యాలయంలో అత్యా ధునిక సాంకేతికత అనుసంధానంతో ఏర్పాటైన ఈ 'త్రిబుల్ సి' ద్వారా ఎంసీసీ ఉల్లంఘనలు, మద్యం అక్రమ రవాణా, సీజర్లపై పటిష్ఠమైన పర్యవేక్షణ, నియంత్రణ ఉంటుంది. అంతర్- రాష్ట్ర సరిహద్దులు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 424 చెక్ పోస్టుల నుంచి వెళ్లే వాహ నాల కదలికలను వెబ్ కాస్టింగ్ ద్వారా ఈ కేంద్రం నుండే పర్యవేక్షణ చేస్తున్నారు. దీని ఫలితంగా రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ ప్రక టించినప్పటి నుంచి నేటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక మొత్తంలో రూ.141 కోట్ల విలువకు పైబడి నగదు, లిక్కర్, డ్రగ్స్, విలు వైన మెటల్స్, ఫ్రీ బీస్, ఇతర వస్తువులను జప్తు చేసినట్లు సీఈవో కార్యాలయం ప్రకటించింది. 2019 ఎన్నికల నిర్వహణ సందర్భంగా జప్తు చేసిన అక్రమ ఆస్తుల విలువ కంటే ఇది దాదాపు రెండు రెట్లు అధికమని స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణకు ముందు ఇంత పెద్ద మొత్తంలో అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకోవడమనేది రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఒక రికార్డుగా పేర్కొంది. ఎన్నికల సందర్భంగా ఓట ర్లపై మద్యం ప్రభావం ఏమాత్రం ఉండకూడ దనే లక్ష్యంతో మద్యం అక్రమ రవాణాను నియంత్రించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసు కునట్లు ఈసీ స్పష్టం చేసింది. రాష్ట్రంలోని మద్యం తయారీ సంస్థల గోడౌన్ల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో ఏర్పాటు చేసిన వెబ్ కెమెరాల ద్వారా మద్యం తయారీ సంస్థల నుంచి గోదా ములకు, షాపులకు, బార్లకు లేదా ఇతర సంస్థ లకు మద్యం సరఫరా చేస్తున్న వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(త్రిబుల్ సి) ద్వారా పర్యవేక్షి స్తున్నట్లు స్పష్టం చేసింది. క్షేత్రస్థాయిలో ఎన్ని కల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమ లుపర్చాలనే లక్ష్యంతో నిరంతరం పర్యటిస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, సెక్టోరల్ అధికా రులు వినియోగించే దాదాపు 1680 వాహ నాలు, ఈవీఎంల రవాణాకు వినియోగించే డీజీటీ వాహనాల కదిలకలను జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా సీఈవో కార్యాలయంలోని త్రిబుల్ సీ కేంద్రం ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ప్రముఖ ఎలక్ట్రానిక్ తెలుగు చాన ళ్లలో నిరంతరాయంగా ప్రసార మయ్యే వార్తాంశాలపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా ఎన్నికల ప్రతికూల వార్తలపై తక్షణ చర్యలు తీసుకోవడానికి ఇద్దరు ఏఎస్ఓ లతో పాటు దాదాపు 25 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు షిఫ్టుల వారీగా ఈ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అదే విధంగా ప్ర ముఖ ఆంగ్ల, తెలుగు దినపత్రికల్లో ప్రతికూల వార్తాంశాలపై కూడా తగు చర్యలు తీసుకుం టున్నట్లు సీఈవో కార్యాలయం తెలిపింది.

సీసీసీలో నిరంతర పర్యవేక్షణ..

కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యా దులు, ఆ సెంటర్ కార్యక్రమాలన్నింటినీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీ నా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆ సెంటర్‌లో అధికారులు, సిబ్బంది పనితీరును మరింత మెరుగుపర్చే విధంగా వారికి ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. మే నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి దోహదపడతాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధి కారి ముఖేష్‌కుమార్ మీనా అభిప్రాయపడ్డారు. అదే సమయంలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేలా రాజకీయ పార్టీలు, వారి ప్రతిని ధులు సహకరిస్తే రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో ఎంతో స్వేచ్ఛగా, జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

చికెన్ బిర్యానీ పెట్టినా... జనం రాలే!

- వైసీపీ అభ్యర్థి వస్తున్నాడంటూ ఒక రోడ్డులో రాకపోకలకు బ్రేక్
- సమయం దాటిపోవటంతో అంబటి మురళి నామినేషన్ నిరాకరణ

పొన్నూరు టౌన్, మార్చి 23: గుంటూరు జిల్లా పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి ముర ళీకృష్ణ నామినేషన్‌కు మంగళవారం అట్టహాసం గా ఏర్పాట్లు చేసుకున్నారు. నిబంధనలకు విరు ద్ధంగా ఆర్‌వో కార్యాలయానికి 20 మీటర్ల దూ రంలోనే భారీగా టెంట్‌లు ఏర్పాటు చేసి చికెన్ బిర్యానీ వండి.. నామినేషన్ కార్యక్రమానికి తర లివచ్చిన వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఆర్ వో కార్యాలయం ఎదురుగా రోడ్డుపై వైసీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. ఆ రోడ్డుపై ట్రా ఫిక్‌ను నిలిపివేయడంతో వాహనాలు నిలిచిపో యాయి. మధ్యాహ్నం రెండున్నర నుంచి నాలు గున్నర వరకూ నడి ఎండలో నిలిచిపోయిన ప్రయాణికులు నరకం చూశారు. ఇక, జన సమీకరణ కోసం పురుషులకు రూ.200, క్వార్టర్ మద్యం, రూ.100 పెట్రోల్ కూపన్, బిర్యాని అందజేశారు. మహిళలకు 500 నగదు, బిర్యానీ అందజేశారు. దాదాపు రెండు గంటల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో భోజన ఏర్పాట్లు చేసిన ప్రాంతంలోని కార్యక ర్తలు భోజనం మిగిలిపోయింది తినండంటూ బస్సులు, ఇతర వాహనాల్లోకి తెచ్చి ఇచ్చారు. పొన్నూరు వెళ్లాల్సిన బస్సులు శివార్లలోనే గంట లకొద్దీ ఆగిపోవడంతో ఎండకు తాళలేక మహి ళలు, పిల్లలు ఎండలోనే నడుచుకుంటూ ఊరి లోకి రావాల్సి వచ్చింది. నాలుగున్నర తర్వాత పోలీసులు శ్రమకోర్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిం చారు. ఇక, చేబ్రోలు, పొన్నూరులోని బంకుల వద్ద వైసీపీ జెండాలతో కార్యకర్తలు కూపన్లు ఇచ్చి పెట్రోలు కొట్టించుకున్నారు. ఆర్వో కార్యా లయం వద్ద బారికేడ్లను వైసీపీ శ్రేణులు ధ్వంసం చేశాయి. ఇంతా చేసినా ఆశించిన మేర నామినేషన్ కార్యక్రమానికి జనం రాలేదు. అంబటి మురళీకృష్ణ కార్యాలయానికి సకాలం(మధ్యాహ్నం 3గంటలలోపు)లో చేరుకోకపోవ డంతో నామినేషన్‌ను స్వీకరించేందుకు అధికా రులు అంగీకరించలేదు.

రూ.1.3 కోట్లకు టోకరా!

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో లాజిస్టిక్స్ వ్యాపారి

ఎండాడ, ఏప్రిల్ 23: విశాఖ నగరానికి చెందిన ఓ లాజిస్టిక్స్ వ్యాపారి సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి రూ.1,30,30,639 పోగొట్టుకున్నాడు. 1930 హెల్ప్ లైన్‌కి కాల్ చేయడంతో సకాలంలో స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు రూ.85,70,923ను హోల్డ్ చేయగలిగారు. ఈ నెల 20న జరిగిన ఈ ఘటనకు సంబంధించి సైబర్ క్రైం పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన లాజిస్టిక్స్ వ్యాపారికి ఈ నెల 20న ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ముం బైలో ఫెడెక్స్ కొరియర్ ప్రతినిధినని, ముంబై నుంచి తైవాన్‌కు మీపేరుపై పార్శిల్ బుక్ అయిందని, అందులో నిషేధిత, చట్టవిరుద్ధ వస్తువులు, ఫేక్ పాస్‌పో ర్టులు, క్రెడిట్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్‌లతోపాటు 720 గ్రాముల డ్రగ్స్ ఉన్నట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించారని బెదిరించాడు. అటువంటి పార్శిల్ తాను బుక్ చేయలేదని లాజిస్టిక్ వ్యాపారి చెప్పడంతో, అతడి వివరాలు, ఎక్కడ ఉంటున్నదీ, ఫోన్ నంబర్లు కూడా చెప్పడంతో కంగారు పడ్డాడు. అంతేకాకుండా పార్శిల్ మీద ఎఫ్ఐఆర్ నంబరు ఎంహెచ్ 1085/1223 బుక్ అయిందని, నార్కోటిక్ పోలీసులకు కాల్ బదలాయిస్తున్నామని చెప్పాడు. విచారణ నిమిత్తం ముంబైకి రావాల్సి ఉంటుందని తెలిపాడు. అయితే తాను అంత దూరం రాలేనని బాధితుడు బదులి వ్వడంతో ఉన్నతాధికారికి ఫోన్ కలుపుతున్నామని, ఆన్‌లైన్‌లో విచారణ చేస్తారని బదులిచ్చాడు. వెంటనే మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చి ఓ స్కైప్ ఐడీ ఇచ్చి అందులో లాగిన్ కావాలని చెప్పాడు. మీరు ఎవరితోనూ మాట్లాడకూడదని, తాము చెప్పి నట్టు నడుచుకోవాల ని చెప్పడంతో బాధితుడు అలానే చేశారు. మీ బ్యాంకు ఖాతా ద్వారా మనీల్యాండరింగ్ జరిగిందని, మీ అకౌంట్స్ నుంచి తీవ్రవాదులకు డబ్బులు అందాయని చెబుతూనే, ప్రస్తుతం మీ అకౌంట్‌లో ఉన్న డబ్బును మాకు ట్రాన్స్‌ఫర్ చేస్తే ఆర్బీఐ నిబంధనల ప్రకారం ఖాతాను చెక్ చేసి, తిరిగి అకౌంట్‌లో జమ చేస్తామని నమ్మబలికారు. దీనికితోడు ఆర్బీఐకి సంబంధించిన లెటర్‌ని బాధి తునికి ఆన్‌లైన్‌లో పంపించాడు. వారు చెప్పినట్టే బాధితుడు తన ఖాతాలోని రూ.1,30,30,639 నగదును వారి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. అయితే దీనిపై అను మానం వచ్చి వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో సైబర్ క్రైం జోన్-2 సీఐ జి.శ్రీనివాసరావు బృందం వివరాలు సేకరించి, నగదులో రూ.85,70,923 మొత్తాన్ని హోల్డ్ చేయించారు.

ఎడాపెడా కరెంటు కొనుగోలు

- రాష్ట్రంలో భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్
- రూ.29 కోట్లు చెల్లించి 39 ఎంయూ కొనుగోలు
- సోమవారం 245.9 ఎంయూల డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతుంటే.. విద్యుత్తు డిమాండ్ కూడా అదేస్థాయిలో ఉంటోంది. డిమాండ్‌కు సరిపడా సరఫరా పేరిట రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు స్వల్పవ్యవధి కింద బహిరంగ మార్కెట్లో ఎడాపెడా కరెంటును కొనుగోలు చేస్తున్నాయి. సోమవారం రాష్ట్రంలో 245.957 మిలియన్ యూనిట్ల (ఎంయూ) డిమాండ్ నమోదైంది. ఈ రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సంస్థలకు సెంట్రల్ పూలింగ్‌తో కలుపుకొని విద్యుత్ ఉత్పత్తి 203 ఎంయూ మాత్రమే ఉంది. దీంతో డిస్కమ్‌లు రూ.29.676 కోట్లు చెల్లించి 39.636 ఎంయూల విద్యుత్‌ను కొనుగోలు చేశాయి. ఎస్టీవోఏ కింద రూ.15.805 కోట్లతో 20.651 ఎంయూలు, టెర్మ్ ఎహెడ్ కింద రూ.10.182 కోట్లు చెల్లించి 13.151 ఎంయూలు కొనుగోలు చేశాయి. డీఏఎమ్ కింద రూ.2.988 కోట్లతో 5.010 ఎంయూలు, ఆర్ టీఎం కింద రూ.0.701 కోట్లతో 0.794 మిలియన్ యూనిట్లు కొనుగోలు చేశాయి. ఎస్‌టీవోఏ కింద 4.8 ఎంయూలు స్వాపింగ్ ద్వారా తీసుకున్నారు. మొత్తంగా 44.436 ఎంయూలను బహిరంగ మార్కెట్లో డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. గత మూడు రోజుల్లో రూ.80 కోట్ల విద్యుత్‌ను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేశాయి. డిస్కమ్‌లు ఈ భారమంతా జనంపైనే వేస్తాయి. మిగిలిన రాష్ట్రాలు విద్యుత్ ఉత్ప త్తికీ.. డిమాండ్‌కీ మధ్య ఉన్న తేడాను షార్టేజీగా చూపిస్తుంటే.. రాష్ట్రంలో మాత్రం అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఎవరి ఆదేశాల మేరకు ఇలా అధిక ధర లకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని నిలదీస్తున్నాయి.

నేడు పాలిసెట్ గ్రాండ్ టెస్ట్

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలకు నిర్వహించే పాలీసెట్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు అవగాహన కోసం బుధవారం రాష్ట్రవ్యా ప్తంగా గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో ఈ టెస్ట్ జరుగుతుందని, దీనికి ఎలాంటి ఫీజు ఉండదని, ఏ విద్యార్థి అయినా దీనిని ఉపయోగించుకోవచ్చని అన్నారు. ఏప్రిల్ 27న పాలీసెట్ జరుగుతుందని పేర్కొన్నారు.